17 వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
వైఎస్ఆర్ కడప / అన్నమయ్య
27 గురువారం, జూన్ 2024 పేజీలు: 08

## సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులు అస్వస్థత

### ఇడ్లీ సాంబారు తినడంతో కడుపునొప్పి, వాంతులు చేసుకున్న విద్యార్థులు



ముద్దనూరు మేజర్‌న్యూస్ : మండల కేంద్రం అయినా ముద్దనూరులోని బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఇడ్లీ ,సాంబారు తిని ఎనిమిది మంది పిల్లలు అస్వస్థత గురి అయ్యారు , ఇద్దరు పిల్లలకు తీవ్ర అస్వస్థతకు గురవడంతో ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఈ సంఘటన తెలియగానే హుటా హుటిన ఆర్డీఓ శ్రీనివాసులు వంట గది, ఆహారాన్ని, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో అధికారులతో మాట్లాడారు. ఆర్డీఓ మాట్లాడుతూ అల్పాహారం, నీటి శాంపిళ్లు సేకరించి పరీక్షలు జరిపించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మంచి ఆహారం , మంచి నీళ్లు అందించాలని వార్డెన్ మనోహర్ కు సూచించారు అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు , సిఐ దస్తగిరి,సోషల్ వెల్ఫేర్ అధికారి సరస్వతి, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి స్వర్ణలత, ఎంపీడీవో చంద్ర మౌలీశ్వర్, యం.ఆర్.పి.యస్. రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ , డిటి సౌజన్య విద్యార్థులను పరిశీలించారు , డి.యం.యచ్.ఓ నాగరాజు పిల్లల పరిస్థితి బాగానే ఉందని తెలిపారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

### గతం వదిలేసి అభివృద్ధికి సహకరించండి
### మండల సర్వసభ్య సమావేశంలో
### ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి



కమలాపురం. మేజర్‌న్యూస్ : మండల అభివృద్ధికి ప్రతి అధికారి కృషి చేయాలని కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు, బుధవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ గండి భారతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి పాల్గొన్నారు, ఎమ్మెల్యే రాక సందర్భంగా మండలాధికారులు ప్రజా ప్రతినిధులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా సభలోని ప్రజా ప్రతినిధులు అధికారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం అన్ని శాఖల అధికారుల వారి పరిధిలోని అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు అప్ర మత్తంగా ఉంటూ, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేయాలని

4లో

## రాజంపేట టీడీపీలో ఇన్‌చార్జ్ 'గోల'




**మేమంటే మేమంటూ ప్రకటనలు**
**అధిష్టానం నుండి రాని స్పష్టత...**
**ఓటమి నుండి గుణపాఠం నేర్చుకొని నాయకులు**
**అయోమయంలో కార్యకర్తలు**
**విజయం రాకపోయినా పెత్తనం కోసం ఆరాటం..**
**తికమక పడుతున్న టిడిపి శ్రేణులు..**

అన్నమయ్య జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్: ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చినట్లు రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో పెత్తనం కోసం నాయకులు పడుతున్న ఆరాటంతో టీడీపీ శ్రేణుల్లో తికమకతో పాటు పార్టీ నాయకుల పై అసంతృప్తి కూడా వచ్చేలా నాయకులు వ్యవహరిస్తున్నట్లు పలువురు కార్యకర్తలు బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపుకు మంచి అవకాశాలున్న అత్యుత్సాహంతో సెల్ఫ్ గోల్ వేసుకొని ఓటమిని కొని తెచ్చుకున్న టిడిపి నాయకుల తీరులో మాత్రం ఎటువంటి మార్పు రాలేదని, ఇప్పుడు టిడిపి ఇన్చార్జి తాము అంటే తాము అని తమ అనుచరుల ద్వారా ప్రకటనలు ఇప్పిస్తుండడం చూస్తుంటే ఓటమి ఎదురైనా కనీసం కార్యకర్తల్లో ఉన్న ఆవేదన కూడా నాయకుల్లో కనిపించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం ఇప్పటికీ ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో రాజంపేట ఇన్చార్జిగా బత్యాల చెంగల్ రాయుడు కొనసాగుతున్నారు. అయితే టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన సుగవాసి బాలసుబ్రమణ్యంకు ఇన్‌చార్జి ఇస్తున్నారని ఆయన అనుచరులు ముందే ఇన్‌చార్జిగా సోషల్ మీడియాలోనూ, వివిధ ప్రచార మాధ్యమాలలోనూ, కార్యక్రమాలలోనూ ఊదరగొడుతుండడంతో అసలు ఈ ఇన్‌చార్జి గోల ఏంట్రా బాబు అంటూ టిడిపి శ్రేణులతో పాటు సామాన్య జనం కూడా ముక్కున వేలు వేసుకుంటున్నారు. మరి అధిష్టానం నుండి ఎటువంటి ఆదేశాలు రాకపోయినా ఎందుకు ఇలా ప్రచారం చేసుకుంటున్నారు అర్థం కావడం లేదు కానీ అసలే టిడిపి సునామీలో కూడా ఓటమి చెందిన బాధలో ఉన్న టిడిపి శ్రేణులకు నాయకుల తీరు మాత్రం మరింత ఆవేదన మిగిలిస్తుంది.

**పెత్తనం కోసం ఆరాటం.. సమర్ధుడికే పట్టం అంటున్న అధిష్టానం**

రాజంపేట నియోజకవర్గంలో పెత్తనం కోసం నాయకులు ఆరాటం ఎలా ఉన్నా, అధిష్టానం మాత్రం సమర్థులకే మొత్తం కడతామంటూ సంకేతాలు ఇవ్వడంతో మరి ఎవరు రాజంపేట పగ్గాలు చేపడతారో అని పలువురు చర్చించుకుంటున్నారు. టిడిపి రికార్డుల ప్రకారం ప్రస్తుతం కూడా బత్యాల ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అయితే అతి తొందరలో మార్పులు చేర్పులు జరిగితే మరి రాజంపేటలో పార్టీని ఎవరు గెలుపు తీరాలకు తీసుకువెళ్తారో అలాంటి నాయకునికే ఇన్‌చార్జి పదవి అప్పగించాలని పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా పార్టీ అధిష్టానానికి సూచిస్తున్నారు. రాజంపేటలో టిడిపి జెండా ఎగరవేసి సువర్ణ అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకొని ఓటమి కొని తెచ్చుకున్న నాయకులు ఇప్పుడు పదవుల కోసం ఆరాటపడడం చూస్తుంటే నవ్వొస్తుందని, రాజంపేట టిడిపినీ నడిపించే నాయకుడిని అధిష్టానమే నిర్ణయిస్తుందని,అంత వరకు అతి ఉత్సాహంతో టిడిపి పరువు తీయవద్దని టిడిపి శ్రేణులు నాయకులకు హితవు పలుకుతున్నారు. మరి చూడాలి తమకు తామే గొప్ప అనుకొని ఓటమి కొనితెచ్చుకున్న నాయకులు ఇప్పటికైనా అధిష్టానం ఆదేశాల కో సం వేచి ఉంటారో లేక పార్టీ పరువును బజార్‌కు ఈడుస్తారో వేచిచూడాలి.

## గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

### ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు : జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ వెల్లడి




కడప క్రైం మేజర్ న్యూస్: జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలపై కొరడా ఝుళిపించేందుకు వందరోజుల కార్యాచరణ ప్రణాళికతో పోలీస్ శాఖ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. ప్రణాళికలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో గంజాయి కేసుల్లో ఉన్నవారిని మళ్ళీ నేరాలకు పాల్పడకుండా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పదే పదే గంజాయి నేరాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లు తెరవడంతో పాటు పి.డి యాక్ట్ ప్రయోగించడం జరుగుతుందని ఎస్.పి తెలిపారు.జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు

## జులై 1నుండి ఇంటి వద్దకే సామాజిక భద్రత

## పెన్షన్ పంపిణీ చేస్తాం - నల్లారి

పీలేరు మేజర్‌న్యూస్: అన్నమయ్య జిల్లా కలికిరి జులై 1వ తేదీ నుండి సామాజిక భద్రత పెన్షన్ అర్హులైన వారి ఇంటివద్దకే పంపిణీ కార్యక్రమం చేపడతామని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన అసెంబ్లీలో శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తమ స్వగ్రామం నగిరిపల్లె కు రావడంతో టీడీపీ, బీజేపీ,జనసేన నాయకులు,కార్యకర్తలు నల్లారి అభిమానులు ఘన స్వాగతం పలికారు. పీలేరు నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకురావడంతో సానుకూలంగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వృద్ధులు, వితంతువులకు "ఎన్టీఆర్ భరోసా" పేరుతో ఏప్రిల్,మే, జూన్, మూడు నెలలకు మూడువేలు, జులై నెల నాలుగు వేలు మొత్తం 7,000 రూపాయలతో పాటు నూతన పాస్ బుక్ కూడా అందజేస్తామని, గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది ద్వారా అందజేయడం జరుగుతుందని సూచించారు ఆగస్టు 1 నుండి యధావిధిగా నాలుగు వేలు పెన్షన్ వస్తుందని అన్నారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు కూడా అమలుకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేస్తామని అన్నారు.



# వీరబల్లి వైద్యశాలను పరిశీలించిన డిఎంహెచ్ఓ



వీరబల్లి, మేజర్ న్యూస్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కార్య క్రమంలో భాగంగా ల్యాబ్ ఫార్మసీ వార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు అనంతరం సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందన్నారు. పారిశుధ్యం పైన చర్యలు చేపట్టా లన్నారు గ్రామాలలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు వైద్య సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనీషా, ల్యాబ్అసిస్టెంట్ కల్పన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్టల్లో ఆహారంలో నాణ్యత పెంచాలి

## దండు వీరయ్య మాదిగ



యర్రగుంట్ల మేజర్ న్యూస్ ప్రభుత్వ సంక్షేమ గృహ వసతు లలోను, డాక్టర్ అంబేద్కర్ గురు కుల పాఠశాలలోను పిల్లలకు ఆరోగ్యకరమైనటువంటి పోషక ఆహారాన్ని సప్లై చేయాలని ఆయా సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు సక్రమంగా లేవని, తాత్కాలికంగా పనులు చేసి కాలం వెళ్ళబుచు తున్నారని, వీటిని ప్రభుత్వం ప్రత్యేక అధికారు లను పంపించి విచారణ ప్రక్షాళన చేయాలని బుధవారం విలేకర్ల సమావేశం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. పట్టణం లో జరిగిన ఆహార తింటాంవల్ల వల్ల 8 మంది విద్యార్థులు అస్వస్థకు గురువు కావడం గమనించిన ఆయన విలేకరుల సమా వేశంలో సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయులు స్వామిని కోరారు. గతంలో ప్రభుత్వంలో తరగతులు కలపటం వల్ల ప్రాథమిక విద్య ప్రాధాన్యత తగ్గిందని ప్రభుత్వానికి తెలిపారు. భాష మారినా ఉపాధ్యాయులు తరగతులు మారిన కొత్త ఉపాధ్యా యులు లేరన్నారు. ఆంగ్ల బోధనకు ప్రత్యేక ఉపాధ్యా యులనుకొత్త సిబ్బందిని నియ మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డప్పు చర్మకళా కారుల రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాదిగ, మండల అధ్యక్షుడు బుసుపాటి రామాం జనేయులు మాదిగ, మండల ఉపాధ్యక్షులు గుడిసె రామయ్య పాల్గొన్నారు.

# తపాలా జీవిత బీమా రేపటి భవిష్యత్తుకు ధీమా



జమ్మలమడుగు మేజర్ న్యూస్ జూన్: తపాలా జీవిత బీమా రేపటి భవిష్యత్తుకు ధీమాగా ఉంటుందని జమ్మల మడుగు పోస్టల్ ఇన్స్పెక్టర్ అనిల్‌రెడ్డి తెలియజేశారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రజ లందరూ సమీప పోస్టాఫీసులను సంప్ర దించి తపాలా బీమా వివరాలను తెలుసు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తపాల శాఖ బీమా ఇస్తున్నటువంటి అధిక వడ్డీ రేట్లు మరే ఇతర ఇన్సూరెన్స్ విభాగాలు ఇవ్వటం లేదని తెలియజేశారు.

# విద్యార్థులను పరామర్శించిన జనసేన



ముద్దనూరు మేజర్ న్యూస్ పట్టణంలోని బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్లో బుధవారం అల్పాహారం తిని ఎనిమిది మంది విద్యార్థులు విషయం తెలుసుకున్న జమ్మలమడుగు జనసేన కోఆర్డి నేటర్ జగదీష్ అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించి, అనంతరం సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాల్లోన అల్పాహారం అనంతరం వాంతులు చేసుకున్న విద్యార్థులను అడిగి, వసతి గృహంలోని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి వసతి గృహం లో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఫ్రైడే-డ్రైడే, కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన



బి.కోడూరు మేజర్ న్యూస్:బుధవారం బి.కోడూరు మండల కార్యాలయం లో మండల అభివృద్ధి అధికారి భాస్కరరావు అధ్యక్షతన మండల లెవెల్ లైన్ డిపార్ట్మెంట్, అనగా అన్ని సచివాలయాల, పంచాయతీ సెక్రెటరీలు, సానిటరీ సెక్రెటరీలు, అన్ని శాఖల అధికారులకు, సీసనల్ వ్యాదులు,స్టాప్, డైయేరియా మరియు జాతీయ కీటక జనిత వ్యాధుల పట్ల అవగాహనా కార్యక్రమం నిర్వ హించి, త్రాగు నీటి ద్వారా వచ్చు వ్యాదులు, ముఖ్యముగా, 01 తేదీ నుండి 31 వరకు డైయేరియా ప్రోగ్రామును అన్ని గ్రామ ప్రజలకు ముఖ్యంగా,0-5 సంవత్సరాల వయసు పిల్లలను డై యేరియా నుండి కాపాడాలని, ప్రజలకు త్రాగునీరు కాచి చల్లార్చి త్రాగమని చెప్పాలని ప్రజలను అందరినీ ఆరోగ్య విధ్య ద్వారా అవగాహన కల్పించి,ప్రజలను చైతన్యవంతులను చేయాలని,అన్నిరకాల మంచి నీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని,వీధులయందు బ్లీచింగ్ చున్నము కలిపిన మిశ్రమాన్ని చెల్లించాలని, తెలియచేసారు. మండల స్పెషల్ ఆఫీసర్, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామములో మంచి నీటివనరులను జాగ్రత్తగా పైపులు లీకేజీ లేకుండా చూసుకోవాలని, క్లోరినేషన్ రెగ్యులర్ గా చేయిస్తు వుండాలని ప్రతి బుధవారం వాటర్ శాంపిల్ తీసి ఆరోగ్య శాఖ వారిచే టెస్టింగ్ చేయించాలని జరగబోవు రోజులల్లో యేవ్యక్తి కూడా డై యేరియాతో గాని మలేరియాతో గాని చనిపోకూడదని మండల స్పెషల్ ఆఫీసర్ అన్నిశాఖల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది.తదుపరి స్థానిక వైద్యులు, డాక్టర్ ఎస్.వినీత్ కుమార్ రాజు మాట్లాడుతూ, ప్రజలు ఎవ్వరు కూడా ఎటువంటి వ్యాధులకు గురికాకూడదని యేవ్యక్తి కూడా అనగా పుట్టిన బిడ్డ మొదలుకొని ఎవ్వరు కూడా డైయేరియా, మలేరియా, ఫైలేరియా డెంగ్యూ చికెన్ గున్య మెదడువాపు, జ్వరం, మొదలగు ఏరకమైన వ్యాధులతో వక్కరు కూడా మరణిం చకూడదని అన్ని శాఖల అధి కారులకు తెలియచేసారు. టి.నరసింహా రెడ్డి సబ్ యూనిట్ ఆఫీసర్ పోరుమామిళ్ల మాట్లాడుతూ అన్నిరకాల జ్వరాలకు, మన ఆశా కార్యకర్తలు ఏఎన్ఎం ఎమ్మెల్ హెచ్ పి దగ్గరనే మలేరియా డెంగ్యూ మొదలగు పరిక్షలు చేయుటకు, ఆర్‌డిటి కిట్స్ మలేరియా,ఆర్టిటి కిట్స్ డెంగ్యూ, వున్నాయని, ప్రజలు ఎవ్వరు కూడా ప్రైవేట్ హాస్పిటల్స్ కు పోయి వేలు వేలు డబ్బులు ఖర్చులు, పెట్టుకోవద్దని మాదగ్గర అనగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రము లో బి.కోడూరులో ఉచితముగా అన్ని రకాల పరీక్షలు,మలేరియా మందులు ఉచితముగా ఇచ్చి వ్యాధిని నయముచేస్తారని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియచేసారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్వో విద్యాసాగర్ ఏపీఎంఓ సీతారామిరెడ్డి ఎంఈఓ మురాతోటి సునీల్ కుమార్ ఈపిఓఆర్డి హరికృష్ణ యాదవ్, హెల్త్ సూపెర్వైసర్, జాన్ విలియం,ఐసీడీస్ సూపెర్వైసర్ సుగుణ వైద్యసిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొనడంజరిగింది.

# దళిత కాలనీలో ప్రారంభ మైన పారిశుధ్య పనులు



కలసపాడు మేజర్ న్యూస్: గత ప్రభుత్వం లో చివరి రెండు సంవత్సరా లుగా జీతాలు లేక పోవడంతో పారిశుధ్య కార్మికులు ఉద్యోగులు జీత బత్యాలు లేక తమకు రావలసిన డబ్బులు ఇవ్వాలని పలుసార్లు కోరినప్పటికీ ప్రభుత్వ అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దిక్కుతోచని స్థితిలో పరిశుద్ధ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం ప్రస్తుతం మారిన రాజకీయ రంగంలో నూతనంగా పరిపాలన ప్రారం భించిన తెలుగు దేశం పార్టీ గ్రామీణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో అభివృద్ధి వైపు పరుగులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటుందని వారు ఆశాభావంవ్యక్తం చేశారు. సింగ రాయపల్లెలో చెత్త ఎక్కడికక్కడ పేరుకు పోవడం వలన గ్రామంలో ప్రజలు అనేక రోగాల బారిన పడి తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారని దీనిపై వెంటనే పారిశుధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ బద్వేలు నియోజకవర్గ యువనాయకులు రితీష్ కుమార్ రెడ్డి దృష్టికి సింగ రాయపల్లె టీడీపి యువ నాయకులు యంబడి కిరణ్ తీసుకెళ్లగా ఆయన వెంటనే అధికారులకు ఫోన్ చేసి మాట్లాడడం జరిగింది అధికారులు వెంటనే స్పందించి పెండింగులో ఉన్న జీతాల తోపాటు సకాలంలో జీతాలు పంపిణీ చేయిస్తామని చెప్పడంతో సింగరాయపల్లెలో పారిశుధ్య పనులు ప్రారంబించారు.

# మాదక ద్రవ్యాలను తరిమికొడదాం



ముద్దనూరు మేజర్ న్యూస్ మండల కేంద్రం అయినా ముద్ద నూరులో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సి.ఐ. దస్తగిరి, యస్.ఈ.బి. సి.ఐ జి.నాయుడు ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ కూడలి నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు విద్యార్థులచే అహగానా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు శారీరక, మానసిక రుగ్మతలను కలిగించడమేకాక, సమా జంలో నైతిక విలువలను దారుణంగా దిగజారుస్తున్నాయి. ఈ మహ మ్మారి నుంచి మానవాళిని కాపాడేందుకు ఏటా జూన్ 26న 'అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం' పాటిస్తున్నారని తెలిపారు. డ్రగ్స్‌కి అలవాటు పడ్డ వారు సామాజిక సంబంధాలను కోల్పోతుంటారని, సన్నిహితులకు దూరంగా గడుపుతారని, కోపంగా ఉంటూ తరచూ ఉద్రేకానికి గురవుతూ వారిలో వారే మాట్లాడుకుంటారని వైద్యులు చెబుతున్నారని తెలిపారు. ఈ మత్తు మందులు పండించేవారు, వ్యాపారం చేసేవారు, కలిగివున్నవారు చట్టపరంగా కఠినంగా శిక్షార్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్.ఐ మొహినుద్దీన్ , యస్.ఈ.బి యస్ఐ శివ శంకర్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్య నివారణలో మహిళల పాత్ర గొప్పది

## ఎస్ఈబి సీఐ సరితా రెడ్డి



వేంపల్లె మేజర్ న్యూస్: మాదక ద్రవ్యాల నివారణలో మహిళల పాత్ర గొప్పదని ఎస్ఈబి సీఐ సరితా రెడ్డి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అక్షర బాలికల జూని యర్ కళాశాలలో మాదక ద్రవ్య నివారణపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సదస్సులో ఎస్ఈబి సీఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల విని యోగంతో జీవితాలు దుర్భరమవుతాయన్నారు. వీటి బారిన పడకుండా ఉండేందుకు, కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలన్నారు. అలాగే మన మధ్య జరిగే చట్ట వ్యతిరేక వ్యాపారాలు తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎక్సైజ్ సిఐ అన్నపూర్ణ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉండాలని, అందుకు సంబం ధించిన తగు సలహాలు సూచనలు చేశారు. అక్షర కళాశాల కరస్పాండెంట్ బి.విజయభారతి మాట్లాడుతూ డ్రగ్స్ నివారణలో మహిళల పాత్ర, ప్రాముఖ్యత గురించి చక్కగా వివరించారు. విధ్యార్థుల చేత డ్రగ్స్ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యోగాంజనేయులు, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై పోలీసులు అవగాహన



రైల్వే కోడూరు మేజర్ న్యూస్ రైల్వే కోడూరు పట్టణంలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్య క్రమాన్ని పోలీసులు నిర్వ హిం చారు. ఈ సందర్భంగా బాల్య దశ నుంచే మత్తు పదార్థాలను వ్యతిరేకించాలని వాటి జోలికి వెళ్లకుండా తల్లి దండ్రులు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని రైల్వే కోడూరు సిఐ టి.బాబు, సురేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రముఖ జూనియర్ కళాశాలలు విద్యార్థిని విద్యా ర్థులలో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు జోలికి వద్దు అని నినాదాలు చేశారు. ఆర్ఎస్ రోడ్డు నుండి బస్టాండు వరకు భారీ ర్యాలీని నిర్వ హించి, బస్టాండ్ వద్ద మానవ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞను చేయించారు.

# వైసిపి శ్రీరంగ నీతులు నమ్మేదెవరు?

## చట్టం తన పని తాను చేసుకుని వెళ్తుంది

## అధికారులు తీసుకునే చర్యలపై టీడీపీపై ఆరోపణలా?

## తెదేపా పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు



రాజంపేట టౌన్ మేజర్ న్యూస్: వైసిపి చెప్పే శ్రీరంగనీతులు అబద్ధాలు నమ్మే కాలం పోయిందని, నాడు ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే అనుమతులు లేవంటూ ప్రజావేదికను కూల్చివేశారని, మరి అనుమతి లేని వైసిపి కార్యాలయాల నిర్మాణాలను కూలిస్తే ఎందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు వైసిపి నాయకులను ప్రశ్నించారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు లేని కట్టడాలను కూల్చివేస్తామని ప్రకటించి అక్రమ కట్టడాల పేరిట ప్రతిపక్ష నేతలకీ చెందిన కట్టడాలు కూల్చివేసిన వైసీపీ నాయకులు చేసిన దౌర్జన్యాలు తమకు చేతకావని, ఎటువంటి అనుమతులు తీసుకోకుండా వైకాపా కార్యాలయాల భవనాల నిర్మాణాలు చేపట్టారని,మరి ఆనాడు జగన్ రెడ్డి చెప్పిన మాటలు నిబంధనలు మీ వైకాపా భవనాలకు వర్తించవా అని ,మరి మీరు చెప్పినట్టు ఈ అక్రమ కట్టడాలను కూల్చివేయాలి కదా అని జగన్ మోహన్ రాజు ప్రశ్నించారు. స్థానిక సంస్థల అధికారులు అనుమతులు లేని భవనాలకు నోటీసులు జారీ చేస్తుంటే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంపై ఎందుకు కుట్ర పన్ని గగ్గోలు పెడుతున్నారో వైకాపా నాయకులు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాలలో వైకాపా కార్యాలయ భవనాలకు స్థానిక సంస్థల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని అధికారులే రికార్డుల ప్రకారం తెలియజేస్తున్నారని, శ్రీకాకుళం,అనకాపల్లి పార్వతీపురం,కాకినాడ రాజమండ్రి,ఏలూరు,విజయవాడ తాడేపల్లి,అన్నమయ్య, నరసరావుపేట, బాపట్ల, నెల్లూరు నంద్యాల, కడప అనంతపురం, పుట్టపర్తి, తిరుపతిలో భవన నిర్మాణ అనుమతుల కోసం కనీసం దరఖాస్తు కూడా చేయలేదనీ, దీన్ని బట్టి చూస్తే వైసీపీ అరాచకాలు అర్థమవుతున్నాయని, విశాఖ, విజయనగరం, మచిలీపట్నం,కర్నూలులో ఆన్లైన్లో దరఖాస్తులు చేసిన వాటికి ఎలాంటి అనుమతులు రాలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సాధారణంగా భవన నిర్మాణాలు చేపట్టే ముందు స్థానిక సంస్థల అనుమతులు తీసుకుంటారని కానీ ఇక్కడ వైకాపా ఆ నిబంధన పాటించలేదని, మరి ప్రజలకు ఒక నిబంధన వైసీపీ కార్యాలయాలకు మరో నిబంధన ఉంటుందా అని ఆయన ప్రశ్నించారు. వైసీపీకి ఘోర ఓటమి ఎదురైన బుద్ధి వచ్చినట్లు లేదని, భవిష్యత్తులో మరింత దిగజారిపోయే విధంగా ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా చట్ట ప్కారం వ్యవహరిస్తే బాగుంటుందని లేదంటే టిడిపి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పులను ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు,పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు,శవనవారి పల్లె సర్పంచ్ కోటయ్య నాయుడు,సీనియర్ నాయకులు జీవి సుబ్బరాజు, తెలుగుయువత పార్లమెంట్ సోషల్ మీడియా కో- ఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

# కూరపర్తి ఆశ్రమ చిన్నారులకు ఉచిత రక్తవర్గీకరణ

## - హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూ బక్కర్ సిద్దిక్ వెల్లడి



మదనపల్లె,మేజర్ న్యూస్ : పట్టణంలోని స్థానిక బసినికొండ నందు గల కూరపర్తి సాయి చైతన్య స్రవంతి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ నందు గల 100 మంది విద్యా ర్థులకు హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్తవర్గీకరణ చేసి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. బుధవారం జరిగిన కార్యక్రమం సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ రక్తదానం ప్రాముఖ్యత, అపోహలపై చిన్నారులకు వివరించి, ఉచిత రక్త వర్గీకరణ నిర్వహించి గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కూరపర్తి సాయి చైతన్య ఆశ్రమ నిర్వాహకులు పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ చిన్నారులకు రక్తవర్గీకరణ నిర్వహిం చిన హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, యువత సేవా మార్గంలో నడవడానికి హెల్పింగ్ మైండ్స్ కృషిని అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్,పవన్, వాలంటరీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రెడ్డి కృష్ణ ఆశ్రమ ఉపాధ్యాయులు రమణ, నాగార్జున, అమరావతి, సుగుణ, శరణ్య, శాంతి, పాపమ్మ పాల్గొన్నారు.

# జాతీయ కళాశాలల ర్యాంకింగ్‌లో అన్నమాచార్య



రాజంపేట, మేజర్ న్యూస్ ఇటీవల ది వీక్ మ్యాగజైన్ ప్రచురించిన జాతీయ కళాశాల ర్యాంకింగ్‌లో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల వివిధ విభాగాలలో టాప్ ర్యాకింగ్‌లలో నిలిచింది. ది వీక్ మ్యాగజైన్ పత్రిక భారత దేశంలోనే ప్రసిద్దిగాంచిన సర్వే పత్రిక. ఈ పత్రిక ప్రతి ఏడాది జూన్ మాసం నందు భారతదేశంలోని కళాశాలల ర్యాంక్‌లను ప్రచురిస్తుంది. ఈ సర్వేను ప్రతి కళాశాలలో నిర్వహించి అక్కడ ఉన్న మౌళిక సదుపాయాలు, అధ్యాప కులు నాణ్యత, పరిశోధన ఫలితాలు, ప్లేస్‌మెంట్ రికార్డులు, మరియు తల్లి దండ్రుల ఫీడ్ బ్యాక్‌ను ఉద్దేశించి ర్యాంక్‌లను ఇవ్వడం జరుగుతుంది. ప్రచు రించిన ర్యాంకింగ్‌లో స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో 8వ ర్యాంక్ ను, అలాగే సౌత్ జోన్ ఇంజనీరింగ్ కళాశాలలో 51వ ర్యాంక్, అఖిల భారత్ ప్రైవేటు ఇంజ నీరింగ్ కళాశాలలో 81వ ర్యాంగ్ భారతదేశంలో బెస్ట్ ఇంజనీరింగ్ కళాశాలలో 109 వ ర్యాంక్‌ను కైవసం చేసుకోవడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ తెలియజేశారు. కళాశాల వ్యవస్థాప కులు డాక్టర్ సి గంగిరెడ్డి ఈ ర్యాంక్‌లు అధ్యాపకలు, విద్యార్థుల కృషికి నిదర్శనమని కొని యాడారు. అన్నమాచార్య కళాశాల విద్య, పరిశోధన ఆవిష్క రణలలో అద్భు తాలకు నిదర్శనమన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ మల్లికార్జున రావు జాతీయ కళాశాలల ర్యాంకింగ్ లో తమ కళాశాల ఉండటంపై హర్షం వ్యక్తం చేశారు.

# 50 వసంతాలు పూర్తి చేసుకున్న జింపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్



రైల్వే కోడూరు మేజర్ న్యూస్ జింపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్ కన్వెన్షన్ సెంటర్ నందు ఆ కంపెనీ విధినిర్వహణలో బాగసౌమ్యుడు ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో కంపెనీ ఎండి వినోద్ చౌదరి, ఆర్.ఎస్.గోయింక అధ్యక్షతన గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ బత్యాల చంగల్‌రాయుడు విచ్చేయగా ఆయన్ని కంపెనీ యాజమాన్యం శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బత్యాల చంగల్ రాయుడు మాట్లాడుతూ జింపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ 50 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని ఎంతోమంది కార్మికులకు భృతి కల్పించి స్వశక్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఈరోజు గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కంపెనీ యాజమాన్య సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియ జేశారు. కార్యక్రమంలో టిడిపి నేత రాష్ట్ర కార్య నిర్వా హక కార్యదర్శి కస్తూరి విశ్వనాధ నాయుడు, మంగంపేట మైన్స్ సిపిఓ సుదర్శన్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నార్జాల హేమరాజ్, ఓబులవారిపల్లి మాజీ జెడ్పిటిసి రమణయ్య యాదవ్, తిమ్మిశెట్టిపల్లి మణి, గౌనూతల ప్రభాకర్ పాల్గొన్నారు.

# మొక్కు చెల్లించిన నాగేశ్వరకొన మాజీ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి



ఖాజీపేట మేజర్ న్యూస్ సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ గెలుపొందిన శుభ సందర్భంగా బుధవారం రోజున నాగేశ్వర కోన మాజీ చైర్మన్ గంగవరం ఆదినారాయణ రెడ్డి తెలుగుదేశం పార్టీ నేతలు కలిసి ఖాజీపేట మండల పరిధిలోని నాగనాదేశ్వర కోనలో 101 టెంకాయ కొట్టి మొక్కుబడి చెల్లించారు అనంతరం అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట.సుధాకర్ యాదవ్ పాలన సజావుగా ఉండాలని ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేయాలని వారు దేవున్ని ప్రార్థించామని పేర్కొన్నారు అనంతరం ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ పుట్టా విజయానికి సహకరించిన నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు కీర్తిశేషులు గంగవరం. రామిరెడ్డి మాజీమంత్రి డి.ఎల్ రవీంద్రారెడ్డి ప్రోత్సాహకం వల్ల ఈ ఆలయం అభివృద్ధి చెందిందని రావుల పల్లె గ్రామ ప్రజల కృషి ఎంతో ఉందన్నారు 2006వ సంవత్సరంలో ఎండో మెంట్ చేరికతో ఆలయానికి రాజకీయాలు అంటుకున్నాయని రాజకీయాలు మాని గుడి అభివృద్ధికి సహకరించాలని వారు సూచించారు కార్యక్రమంలో ఖాజీపేట టి.డి.పి మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఇరగంరెడ్డి. ప్రసాద్ రెడ్డి, సుబ్బయ్యయాదవ్, హరినాథ్ రెడ్డి, సుమన్‌రెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, మురళిమోహన్‌రెడ్డి, లాయర్ నారాయణరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి, ఓబుల్ రెడ్డి చంద్రారెడ్డి, విశ్వేశ్వరరావు, విజయ్ మోహన్ రమేష్‌బాబు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అన్యాయంగా మా నివాసాలను కూల్చివేశారు

## మంగంపేట యానాదుల ఆవేదన



రైల్వే కోడూరు మేజర్ న్యూస్ రైల్వే కోడూరు నియోజకవర్గంలోని మంగంపేట యానాదులు నివసిస్తున్న 11 నివాసాలను నోటీసులు ఇవ్వకుండానే నివాసాలను కూల్చివేశారని మంగంపేట యానాదులు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం మంగంపేట గ్రామ పరిధి లోని యానాదులు నివసిస్తున్న నివాసాలను ఏపీ ఎంపీసీ సంస్థ నివాసాలపై పూర్తిస్థాయిలో కక్ష కట్టుకొని నిర్మాణాలను తోసి వేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వ కుండా మా వద్ద సర్వే పట్టాలను పొంది ఉన్నామని యాజమాన్యం పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వకుండా జెసిపి యంత్రాలతో పూర్తి స్తాయిలో నేల మట్టం చేశారని వారు అన్నారు. వైసిపి ప్రభుత్వం ఉన్న సందర్భంలో ఎటువంటి హాని తలపెట్టని యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయాలను తీసుకొని యానాదుల నివసిస్తున్న ఇళ్లపై దురుద్దేశంతోనే కక్ష కట్టి కూల్చివేశారని దీనిపై సంబంధిత యాజ మాన్యానికి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని, ప్రజాసంఘాలతో ధర్నాలు నిర్వహిస్తామని అన్నారు.

# ఇంటర్నషిప్ లో పాల్గొన్న మిట్స్ కళాశాల విద్యార్థులు

కురబలకోట,మేజర్ న్యూస్ : మండలంలోని అంగళ్లు వద్ద గల మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ మిట్స్ కళాశాల)లో నందు ఎలెక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగులో మూడవ సంవత్సరము చదువుతున్న కె.స్వాతి,పి.షాకీర్ హుస్సేన్, పి.తేజశ్రీ, బి.సాయి హర్షిత, కె.సింధు, పి.శ్రీని వాసులు, ఆర్.వినోద్ కుమార్ ఎస్.గౌతమి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫ ర్మేషన్ టెక్నాలజీ,డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్,కాంచీపురంలో ఇంటర్నషిప్ లో పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు.ఈ ఇంటర్న్ షిప్ సమయంలో విద్యార్థులు విఎల్ఎస్ఐ డిజైన్ ప్రాజెక్ట్‌లో పని చేస్తారని ఆయన అన్నారు.ఈ విద్యార్థులు 45 రోజులపాటు ఈ ఇంటర్న్షిప్‌లో పాల్గొంటారని ఆయన అన్నారు. ఎంపికయిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల,ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్,విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్ అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.



## శ్రీ రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌గా పేరు కొనసాగిస్తాం



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న శ్రీ రంగనాథ స్వామి ఆలయం వద్ద ఉన్నటువంటి కూరగాయల మార్కెట్ ను శ్రీ రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌గా పేరు మార్చి కొనసాగిస్తామని టిడిపి నాయకులు బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి, మహబూబ్ బాషా, నల్లగారి భాస్కర్ రెడ్డి తూగుట్ల మధుసూదన్ రెడ్డి, బిజెపి నాయకులు వంగల శశి భూషణ్ రెడ్డి, జనసేన నాయకుడు ఆలూరు ముని జగదీష్ బాబు మరియు హిందూ ఐక్యవేదిక సభ్యులు పేర్కొన్నారు. వివరాలకు వెళితే గత ప్రభుత్వంలో ఈ కూరగాయల మార్కెట్ కు వైయస్సార్ కూరగాయల మార్కెట్ గా వైసిపి నాయకులు పేరు పెట్టడం జరిగిందని, కాకపోతే చాలా సంవత్సరాల కాలం నుండి ఈ మార్కెట్ కు రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ గా పేరు కలగని, ప్రజలు కూడా రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ అని పిలిచే వారని, ఈ విషయాలపై గతంలో హిందూ ఐక్యవేదిక సభ్యులు రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్‌గా పేరు కొనసాగించాలని ఎన్నో ర్యాలీలు ప్రభుత్వానికి అర్జీలు ఇవ్వడం జరిగిందని, వైసిపి నాయకుల రాజకీయ లబ్ధి కోసం ఎక్కడ చూసినా వైయస్సార్ అనే పేరుతో నామకరణాలు చేయడం జరిగిందని, వాటిలో భాగంగా వైయస్సార్ కూరగాయల మార్కెట్ ను పేరు తొలగిస్తూ రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ గా ఫ్లెక్సీ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని అంతేకాకుండా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో రంగ నాథ స్వామి కూరగాయల మార్కెట్ గా పేరును చేర్చాలని, కూటమి సభ్యులు డిమాండ్ చేయడం జరుగుతుందని, పేరును మార్చని పక్షంలో ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్నటువంటి నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, కావున ఎన్ని అడ్డంకులు ఎదురైనా రంగనాథ స్వామి కూరగాయల మార్కెట్ గా పేరు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు బిజెపి నాయకులు హిందూ ఐక్యవేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు,

## సరస్వతీ నగర్‌లో

# భారీ చోరీ



మదనపల్లె క్రైమ్, మేజర్‌న్యూస్ : మదనపల్లె ఎగువ కురవంకలోని సరస్వతి నగర్లోని ఓ ఇంటిలో దొం గలు భారీ చోరీకి పాల్పడ్డారు. యజ మాని తాళం వేసుకొని వెళ్లడాన్ని గుర్తించిన దొంగలు పథకం ప్రకా రం తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న పది లక్షల నగదు సుమారు 5 లక్షల పైగా వెలుగు చేసే బంగారు ఆభరణాలు అపహరించుకు వెళ్లా రు. ఇందుకు సంబంధించి బాధితు డు మదనపల్లె తాలూకా పోలీసుల కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐఎన్ శేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి.. మండలంలోని పొన్నేటి పాలెం పంచాయితీ, సరస్వతీ నగర్ లో కాపురం ఉంటున్న వెంకటేష్ నాయక్ ఇంటికి తాళం వేసి సొంత పనిపై కుటుంబీకులతో పొరుగు గ్రామానికి వెళ్ళాడు. ఆ సమయంలో దొంగలు ఇంట్లో ఎవరూ లేరని గుర్తించి పథకం ప్రకారం అర్ధ రాత్రి వేళ ఇంటి తలుపులకు వేసిన తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న బం గారు ఆభరణాలు పది లక్షల నగదు, మరో ఐదు లక్షల బంగారు ఆభరణాల ను అపహరించుకుని వెళ్లారు. బాధితుడు బుధవారం ఉదయం ఇంటికి రావ డంతో ఇంట్లో చోరీ జరగడాన్ని గుర్తించాడు. వెంటనే తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ స్పందించి బాధితుడు వెంకటేష్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో చోరీ జరిగిన తీరును పరిశీలించిన సీఐ క్లూస్ టీం ఆధారంగా నిందితులకు సంబంధించిన వేలు ముద్రలను సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ తెలిపారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

మొదటి పేజీ తరువాయి



తెలిపారు, కొంతమంది అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజలకు శాపంగా మారుతుందని తీరు మారకపోతే ఎటు తప్పదన్నారు, మండలంలోని అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలి అన్నారు, శాఖల వారీగా వారి పనితీరును సమస్యలను ఆయన అడిగి తెలుసు కున్నారు, ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు, మండలంలోని పలు గ్రామాలలో ఉన్న సమస్యలపై ఆయన చర్చించారు, ఆర్డబ్ల్యూఎస్, అగ్రికల్చర్, పశుసంవర్ధక శాఖ, విద్యుత్, నియంత్ర విద్య తదితర శాఖల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం చేసే విధంగా ఉండాలన్నారు, అధికారు లు నిర్లక్ష్యంగా పనిచేస్తే ఎటువంటి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు అని అలా చేసిన వారిపైన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, ముఖ్యంగా రెవెన్యూ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలకు వచ్చిన ప్రజలను ఇబ్బందులకు గురి కాకుండా సకాలంలో ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అంద జేసే విధంగా అధికారులు పనిచేయాలన్నారు, అదేవిధంగా కమలాపురం మం డలాన్ని ఒక మోడల్‌గా చేయాలన్నారు, అలాగే సర్పంచుల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు, దీనికి అంతటికి మీ అందరి సపోర్ట్ కావాలని అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ప్రతి ఒక్క సమస్య తీసుకువెళ్లి పరిష్కరించేలా చేస్తానని ఎమ్మెల్యే అన్నారు, ఏదో నాలుగు బిల్లింగ్ కట్టుకొని గత ప్రభుత్వం అభివృద్ధి జరిగిందని చెప్పుకుంటున్నారని ఎక్కడే గాని అభివృద్ధి జరగలేదన్నారు, అనంతరం స్థానిక రైతుబజా కేంద్రంలో వల్లూరు, కమలా పురం. వీరుపానాయన పల్లి మండలాల వ్యవసాయ అధికారులు రైతు భరో సా కేంద్ర సిబ్బందితో సమావేశ నిర్వహించారు, ఈ సందర్భంగా రైతులు పొ లం పనులు చేసుకుని సిద్ధంగా ఉన్నారని పంటలు పండించుకునేందుకు దుక్కిలి కూడా చేశారని రైతులకు కావలసిన ఎరువులు విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉంచాలన్నారు, అదేవిధంగా రైతుల ఇన్సూరెన్స్ విష యంలో జాగ్రత్తగా ఉండాలని రైతులను రైతు భరోసా కేంద్రాల చుట్టూ తిప్పు కోకుండా వచ్చిన వెంటనే పనిచేసే విధంగా చూడాలని అధికరణ ఆదేశించా రు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, ఎమ్మార్వో సుబ్రమణ్యం, ఏడిఏ నర సింహారెడ్డి, ఉపఎంపీపీ చెన్నకేశవరెడ్డి, జడ్పిటిసి సుమిత్ర, మండల అధికా రులు ఎంపీటీసీలు సర్పంచులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పునరావాసం కల్పించి నష్ట పరిహారం ఇప్పించండి : ఎస్టీ కాలనీ వాసులు




ఓబులవారిపల్లి మేజర్ న్యూస్: ఓబులవారిపల్లి మం గంపేట ఎస్టీ కాలనీ వాసులు తాము నిర్మించుకున్న గృహ నిర్మాణాలను ఎటుటువంటి నోటీసులు లేకుండా నిరక్ష్యంగా కూల్చివేశారని మీడియా సమావేశం నిర్వ హించి ఎస్టి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా చంటి లక్ష్మీదేవి మాట్లాడుతూ 20 సంవత్స రాలుగా నివాసం ఉంటున్నామని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కట్టడా లను కూల్చివేసారని గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనింగ్ నివేదికలో 10 కుటుంబాలు ఎస్టి కాలనీ వాసులు కాపురం ఉన్నట్టు గుర్తించడం జరిగిం దన్నారు వెంటనే సంబంధిత ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి తమ కుటుంబాలుకు న్యాయం చేయాలన్నారు 10 కుటుంబాలకు సంబంధించిన వారి సంతానం బుద్ధి చెంది 21 కుటుంబాలుగా వృద్ధి చెందడం జరి గిందన్నారు మంగంపేట ఎస్టి కాలనీలో నివాసాలు ఏర్పరచుకుని పశువులను మేపుకుంటూ రైతుల పొలాలలో రైతు పనికి వెళుతూ జీవనం సాగిస్తు న్నామన్నారు ప్రజాప్రతిని ప్రభుత్వ అధికారులు పునరావాసాలను కల్పించిన నష్టపరిహారం అందించాలని మీడియా ద్వారా కోరారు ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య ఎస్టి కాలనీవాసులు పాల్గొన్నారు.

## రాంప్రసాద్ రెడ్డి గెలుపుతో మొక్కు తీర్చుకున్న మండిపల్లి అభిమానులు



చిన్నమండెం, మేజర్‌న్యూస్ : మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి ఎమ్మె ల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ఆయన గెలుపు కోసం ముందుగా మొక్కుబడితో కేశపురం గ్రా మం దేవళంపేట నందు వెలసిన శ్రీ పాలేటమ్మ తల్లికి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చు కొన్నారు. పడమ టికోన గ్రామం కుమ్మరపల్లికి చెందిన వట్టం శేఖర్ రెడ్డి సోదరులు ఈ కార్యక్ర మంలో రాష్ట్ర క్రీడ, రవాణా శాఖ మం త్రి వర్యులు రాంప్రసాద్ రెడ్డి తనయుడు నిచ్చల్ నాగిరెడ్డి పాల్గొని టెంకాయలు కొట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు వారితో పాటు మండిపల్లి అభిమానులు టిడిపి నాయకులు, తినమండి మండలంలోని అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ట్రాక్టర్ మెకానిక్ మృతి

మదనపల్లె క్రైమ్, మేజర్ న్యూస్ : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ట్రాక్టర్ మెకానిక్ మృతి చెందినట్లు మదనపల్లి తాలూకా సిఐ శేఖర్ తెలిపారు. సీఐ బుధవారం మీడియాకు తెలిపిన వివరాల మేరకు. అన్నమయ్య జిల్లా, మదనపల్లె మండలం, పుంగనూరు రోడ్ లోని 150వ మైలు వద్ద మే నెల 20వ తేదీన రెండు బైకులు ఎదు రెదురు ఢీకొన్న సంఘటనలో ములకలచెరువు మండలం, బురకాయల కోటకు చెందిన ఒకరు కలికిరికి చెందిన మరొకరు అక్కడికక్కడే మృతి చెందడం పాఠకులకు విధితమే. ఈ ఘటనలో స్థానిక ఎస్టేట్ కు చెందిన ట్రాక్టర్ మెకానిక్ రాజశేఖర్ రెడ్డి (42) తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకోగా అతన్ని కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం చెన్నై లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు అందించినా కోలుకోలేదు చివరకు బుధవారం ఉదయం అతను చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

# మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు

## డీఎస్పీ శ్రీధర్



కలికిరి, మేజర్‌న్యూస్ :మాదకద్రవ్యాల జోలికెళ్లి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని రాయచోటి డిఎస్పి శ్రీధర్, కలికిరి ఇన్స్పెక్టర్ మోహన్, సబ్ ఇన్స్పెక్టర్ దేవేంద్ర కుమార్ విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీనివాస కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువకుల్లో కొందరు జైలు పాలవుతుండగా, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. విద్యార్థులు వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా వాటిని కలిగివున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇన్స్పెక్టర్ మోహన్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యం

## ఎమ్మెల్యే షాజహాన్ బాషా



మదనపల్లె,మేజర్ న్యూస్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఆంజనేయ స్వామి దేవాలయానికి చెందిన సుమారు రెండు ఎకరాలు విలువైన భూమిలో ఎండోమెంట్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని మండల తహసీల్దార్ మరియు కమీషనర్ కు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు.బుధవారం మేదర బజారు మరియు ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దీర్ఘ కాలంగా ఈ భూమిలో అక్రమణలు వెలిశాయన్నారు.స్థానికంగా వున్న రెండు ఎకరాల స్థలంలో మోడల్ ఎండోమెంట్ కాంప్లెక్స్ నిర్మాణం,షాపింగ్ మాల్ నిర్మాణం పూర్తి చేస్తే సుమారు వంద రూములు వస్తాయని తద్వారా స్థానికు లకు,యువతకి ఉపాధి అవకాశాలు దక్కుతయాన్నారు.మదనపల్లి పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మదనపల్లి అభివృద్దే ధ్యేయంగా పనిచేయడానికి 700 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని,ఈ ప్రతిపాదనలు త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని స్పష్టం చేశారు.పట్టణంలో ప్లైఓవర్లు నిర్మిస్తామని,ఏ ఒక్క భవనం కూడ కూల్చకుండ ఫ్లై ఓవర్ నిర్మాణం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.నియోజకవర్గంలోని అన్ని డిపార్ట్మెంట్లు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సకాలంలో, సగౌరవంగా పని చేస్తాయన్నారు. మదనపల్లి పట్టణంలో మురికినీటి కాలువలు, రోడ్లు, ఫ్లైఓవర్లు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ కు మరియు సంబందింత అధికారులకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు.ఇందులో భాగంగా కదిరి రోడ్డు టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులతో కలిసి సందర్శించారు.మురుగునీరు వెళ్ళడానికి కాలువలను తక్షణమే పునరుద్ధించాలని సూచించారు.అలాగే ప్రజా సమస్యలపై సుడిగాలి పర్యటన చేశారు.వర్ష కాలం కావడం పరిసరాల పరిశుభ్రత, పారిశుద్యంపైన ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు.మున్సిపల్ పారిశుధ్య విభాగంచే గ్యాంగ్ వర్క్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని అధికారులకు ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ప్రమీల,వివిధ శాఖల అధికారులు,టిడిపి నాయకులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కనుమరుగైన చేతిపంపులు



వీరబల్లి మేజర్ న్యూస్: ప్రస్తుత కాలం మనషులు కాలానికి అనుగుణంగా జనం మారుతూ వచ్చారు. అదేవిధంగా గత తరానికి ముందు ఉన్నట్టు వంటి అన్ని తీపి గుర్తులు ఇప్పటికే కనుమరుగయ్యాయి. మిగిలిన కొద్దిపాటి తీపి గుర్తులు కూడా రాబోయే తరం వరకు కనుమరుగవడంలో ఆశ్చర్యం లేదు. మన తాతల, తండ్రుల కాలంలో గ్రామీణ, పల్లె ప్రాంతాలలో ఎక్కడ చూసినా చేతిపంపులు పుష్కలంగా ఉండేవి. అక్కడక్కడ చేదురు బావులు కూడా కనిపించేవి. కానీ ప్రస్తుత తరానికి వచ్చేసరికి చేదురు బావులతోపాటు చేతిపంపులు (బోరింగులు) కూడా కనుమరుగయ్యాయి. గతంలో ఉన్న చేత బావులను ప్రజలు పూర్తిగా పూడ్చి వేశారు. అదే విధంగా చేతిపంపులు కూడా కనిపించకుండా పోయాయి. కొన్ని చోట్ల మాత్రం చేతిపంపులను ఊడదీసి బోరు మోటార్లను బిగించారు. మరికొన్ని ప్రాంతాలలో చేతిపంపులు పూర్తిగా వాడుకోక పూర్తిగా తుక్కుపట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో బయట నుంచి అప్పట్లో లాగా నీటిని మోసుకొని రావాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం ఎక్కడైనా ఏ ప్రాంతంలోనైనా చెదురుబావులు, చేతి పంపులు కనిపిస్తే ఫోటోలకు ఫోజులిస్తూ అలనాటి తీపి గుర్తులుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆనాటి చేదురు బావులు, చేతి పంపులతో తెచ్చుకున్న నీరు తాగిన వారంతా ఆరోగ్యంగానే ఉండేవారు. టెక్నాలజీ పెరిగిపోతుండడంతో దానికి తోడుగా ప్రజలు కూడా దినదినానికి అభివృద్ధి చెందుతూ మారుతూ వచ్చారు. ప్రస్తుత కాలంలో చాలా కొరకు ఇంటింటికి బోర్లను వేయించుకుంటున్నారు. దీంతో బయట నుంచి అప్పట్లో లాగా నీటిని ఐమోసుకొని రావాల్సిన అవసరం లేకుండా పోయింది

# విద్యార్థులకు పఠనా సామాగ్రి పంపిణీ చేసిన వాసుదేవ కుమార్



రామాపురం మేజర్ న్యూస్: మండలంలోని రాచపల్లి పంచా యతీ వెంకటాపురానికి చెందిన జనని సోషియల్ సర్వీస్ ట్రస్ట్ ద్వారా ట్రస్టు చేర్మన్ వాసుదేవ కుమార్ సుమారు 150 మంది విద్యార్థులకు తగు పఠనా సామాగ్రి పలకలు, పెన్సిల్లు, నోట్ పుస్తకాలు, కాఫీ రైట్స్ పుస్తకాలు బుధవారం రామాపురం ఎంఈఓలు రామకృష్ణుడు, జయచంద్రుల ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా తండ్రి విశ్రాంత ఉపాధ్యా యుడు కీర్తిశేషులు వెంకటన్న జ్ఞాపకార్థంతో రాచపల్లి గ్రామంలోని గంగనేరు వెంకటాపురం లలో ఉర్దూ, యూపీ, అంగన్వాడి పాఠశాలలో 150 మంది విద్యార్థులకు పలకలు పెన్సిళ్లు కాఫీ రైట్స్ పుస్తకాలు, నోట్స్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. నా తండ్రి స్వర్గీయ వెంకటన్న గారు మండలంలో 40 సంవత్సరాలు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయలు గా విద్యారంగానికి ఎనలేని సేవలు చేసి ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయిలోకి తీసుకువెళ్లడంలో కారుకులయ్యారు. ఆయన జ్ఞాపకార్థం జనని సోషయల్ సర్వీస్ ట్రస్టు ద్వారా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని విద్యార్థులు వాటిని సద్వినియోగము చేసుకొని చదువులో బాగా రాణించాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మండలంలో పదవ తరగతి విద్యార్థుల్లో టాప్ ర్యాంక్ సాధించిన వారికి జనని సోషయల్ సర్వీస్ ట్రస్టు ద్వారా బహుమతులు అందజేయడం జరుగుతుం దన్నారు. ఎంఈఓ లు రామకృష్ణుడు జయచంద్ర మాట్లాడుతూ డబ్బు అందరి దగ్గర ఉంటుంది కానీ సాధ్య మైనంతవరకు ఎవరు బయటకు తీయరు కానీఇక్కడున్న ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ సహకారంతో వాసుదేవ్ కుమార్ విద్యార్థులకు విద్యా సామాగ్రిని పంపిణీ చేసే నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయం అని అన్నారు. అన్నదానం ఆకలి తీరుస్తుంది కానీ విద్యాదానం జీవితాన్ని ఇస్తుంది కావున వాసుదేవ్‌ను అందరూ స్ఫూర్తి తీసుకొని ఇంకా దాతలు అందరూ ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, సిఆర్పి విశ్వనాథ, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కాలినడక తిరుమలకు

## మొక్కుబడి తీర్చుకుంటున్న టిడిపి నాయకులు





వల్లూరు మేజర్ న్యూస్ కమలాపురం ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి గెలుపొందినందుకు మొక్కుబడి పెట్టుకున్న వల్లూరు మండల పరిధిలోని దిగువపల్లి టిడిపి నాయకుడు సుధా మదన్ మోహన్ రెడ్డి, సుధా రమణారెడ్డి, వై శివారెడ్డి, కె శివారెడ్డి, ఓబుల్ రెడ్డి, ఎస్ జగదీస్ రెడ్డి, కె వెంకట రమణ లు గోవిందా గోవిందా అంటూ తిరుమలకు కాలినడకన బయలుదేరారు, బుధవారం ఉదయం దిగువపల్లిలోని శ్రీ ఆంజనేయ స్వామి గుడిలో రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కమలాపురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, యువనాయకుడు పుత్తా సాయి నరసిం హారెడ్డి, పుత్తా అల్లుడు యశ్వంత్ రెడ్డి, వల్లూరు మండల టిడిపి అధ్యక్షుడు లేబాక నాగేశ్వర రెడ్డి పూజ కార్యక్రమం నిర్వహించి టెంకాయ కొట్టి కాలి నడకన తిరుమలకు వెళుతున్న వారిని గ్రామం దాటినంతవరకు నడిచి సాగనం పారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నన్ను ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేసే దేవుని మొక్కుబడులు పెట్టుకొని తిరుమలకు కాలినడకన వెళుతున్నందుకు నాకు చాలా సంతోషకరంగా ఉందన్నారు, ఆ తిరుమల వెంకన్న స్వామి దయతో ఈ కార్యక్రమం మంచిగా జరగాలని కోరుకుంటున్నా అన్నారు, దేవుని ఆశీస్సులు ఉండి మంచి జరగాలని కోరారు, టిడిపి నాయకులు కార్యకర్తలు, పుత్తా అభిమానులు కష్టపడి నన్ను ఎమ్మెల్యేగా గెలిపించారు, కమలాపురం నియోజకవర్గం లో అభివృద్ధి చేసి ప్రతి కుటుంబం బాగుపడేలా న్యాయం చేస్తానన్నారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎర్రమాచు రామసుబ్బారెడ్డి, గడికోట సుధాకర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, మండల టిడిపి కార్య నిర్వాహ కార్యదర్శి ఎల్లప్ప గారి రామచంద్రారెడ్డి, కడప పార్లమెంట్ బీసీ కార్యదర్శి ఇరగనబోయిన హరికృష్ణ యాదవ్, శ్రీనివాసులు రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఆకుల శ్రీనివాసులు, విశ్వనాథ్ రెడ్డి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కక్షపూరితంగా వ్యవహరించిన ఏ ఒక్కరిని వదిలిపెట్టం

## టిడిపి బాధితులను పరామర్శించిన బత్యాల



పుల్లంపేట, మేజర్ న్యూస్ ఎన్నికల రోజు రైల్వేకోడూరు నియో జక వర్గం పుల్లంపేట మండలం దలవాయిపల్లి పోలింగ్ కేంద్రం నందు జరిగిన ఘర్షణలో దల వాయి పల్లికి చెందిన మల్లు వెంకటే శ్వర రెడ్డి అలియాస్ రాజారెడ్డి, మల్లు సిద్ధారెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దస్తగిరి, సిద్ధిక్‌లను తప్పుడు కేసు బనాయించి వారిని జైల్లో వేసిన విషయం అందరికీ తెలిసిందే. వారికి మొన్న బెయిల్ మంజూరై జైలు నుండి ఇంటికి రాగా బుధవారం నాడు వారి ఇండ్లకు వెళ్లి మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,రాజంపేట నియోజకవర్గ ఇంచార్జ్ బత్యాల చంగల్ రాయుడు వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్య పడొద్దు అండగా ఉంటామని ,ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు.అలాగే కక్షపూరి తంగా వ్యవహరించి అక్రమ కేసులు పెట్టిన ఏ ఒక్కరిని వదిలిపెట్టనని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ వీర అంధుల ఆశ్రమం దుప్పట్లు పంపిణీ



పులివెందుల రురల్ న్యూస్ పులివెందుల పట్టణం కచేరీ రోడ్ యందు. సంగి రెడ్డి అంకి రెడ్డి మంగమ్మ జ్ఞపకర్తముగా కుమా రుడు వెంకట రమణారెడ్డి చేతుల మీదుగా దుపట్లు పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మానవ సేవ మాధవసేవ అని ప్రతి ఒక్కరూ చేత నైన సహాయం చేయాలి అని తెలియ జేశారు.. ఆశ్రమం నిర్వాహకులు అణిమెల రామ మోహన్ పాల్గొన్నారు.

# అర్హులకు అన్ని పథకాలు అందిస్తాం

## దాసరిపల్లి జయచంద్ర రెడ్డి



ములకలచెరువు, మేజర్ న్యూస్ : తంబళ్లపల్లి నియోజకవర్గంలోనీ ముల కల చెరువు, కురబలకోట మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికా రులు సచివాలయం ఉద్యోగులు తెలుగుదేశం కార్యకర్తలతో తంబళ్లపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి జయచంద్రరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కూటమి నాయకులు జూలై నెల పెన్షన్ పంపిణీ 28 కేటగిరీలలో వివిధ వర్గాలకి పెన్షన్ పెంచడం జరుగుతుందని మూడు వేల రూపాయల నుంచి 4000 పెంచడం జరుగుతుందన్నారు. మా ప్రభుత్వం రాగానే మొట్టమొదటి నెలలోనే పెన్షన్ పెంచి ఇస్తామని చెప్పారో దానికి అనుగుణం గానే జులై మొదటి పెన్షన్ ఇవ్వ బోతున్నమని దాదాపుగా 65.3 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది గత వైకాపా ప్రభుత్వం 1000 పెంచడానికి నాలుగు సంవత్సరాలు సమయం తీసుకుంటే ఈరోజు 1000 పెంచడానికి కేవలం పది రోజులు మాత్రమే సమయం తీసు కున్నాం. ఒకటో తారీఖున సచివాలయం సిబ్బంది తో ఇంటింటికి తీసుకువెళ్లి ప్రజలు వృద్ధులు అవసరాలు తీర్చ డం కోసం ఈ పెంపు ఉపయోగ పడుతుంది అర్హులైన ప్రతి ఒక్క రికి ఈ పథకం చేరాలి ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న మా నాయకులను ముందు పెట్టుకొని అర్హులైన ప్రతి ఒక్కరికి పంపిణీ చేయాల్సిందిగా సచివాలయ ఉద్యోగులకు సూచించారు. అర్హత వుండి పెన్షన్ రాని వారిని గుర్తించి వారికి పెన్షన్ అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, కార్య దర్శులు, టిడిపి నాయకులు మంత్రి గిరిధర్ రెడ్డి, సీడ్ మల్లికార్జున నాయుడు, మండల కన్వీనర్లు పాలగిరి సిద్ధ, వై జి సురేంద్ర, ఆనంద్ రెడ్డి, నారాయణ స్వామి రెడ్డి పాల్గొన్నారు.

# మా భూమికి రక్షణ కల్పించండి

## కబ్జా దారుల నుంచి కాపాడండి
## బాధితురాలు నూనె రాజేశ్వరి



కడప సిటి మేజర్ న్యూస్: తమ భూమికి రక్షణ కల్పించి, కబ్జా దారుల నుంచి కాపాడాలని బాధితురాలు నూనె రాజేశ్వరి వేడుకున్నారు బుధవారం నగరంలోని స్థానిక వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఆవేదన వ్యక్తంచేశారు గోపవరం మండలం పరిధిలో ఉన్న మడకలవారి పల్లె సర్వే నంబర్ 809 లో 5.08 సెంట్లు భూమిని 1917 లో తమ పూర్వీకులు నూనె అంకన్న మహబూబ్ మియా నుంచి కొనుగోలు చేయడం జరిగిందన్నారు ఆతర్వాత తన తండ్రి నూనె సుబ్బరాయుడు నుంచి నూనె రాజేశ్వరి అను నాకు 2 ఎకరాల 54 సెంట్లు భూమి వారసత్వంగా సంక్రమించిందని చెప్పారు. దానికి సంబంధించిన ఆధారాలు హెచ్‌ఆర్ లో కూడా ఉందని చెప్పారు. అయితే కొంతమంది తమ భూమిని కబ్జా చేయడానికి అనేక ప్రయత్నాలు చేశారని దానిపై రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేయగా వారు పరిశీలించి తన పేరు మీద ఆన్ లైన్ లో నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకం కూడా ఇచ్చారని తెలిపారు అయినప్పటికీ కబ్జా దారుల ఆగడాలు ఎక్కువ కావడంతో కోర్టును ఆశ్రయించగా తమకే అనుకూలంగా తీర్పు ఇచ్చారని తెలిపారు కాబట్టి మా భూమికి రక్షణ కల్పించి కబ్జా దారుల నుంచి కాపాడాలని కోరారు ఈ సమావేశంలో పునీత్ తదితరులు పాల్గొన్నారు.

# జులై ఒకటి నుండి రూ,7 వేలు పింఛన్ క్యాబినేటిలో ఆమోదించడం హర్షనీయం



తొండూరు మేజర్ న్యూస్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంపు ఏప్రిల్ నుంచి అమలు చేస్తూ పాత వాటితో కలిపి ఒక లబ్ధిదారుకు జులై ఒకటిన రూ,7 వేలు ఇచ్చేలా క్యాబినెట్ లో ఆమోదించడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతకుంట నాగిరెడ్డి అన్నారు. తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చరిత్రలో నిలిచేలా పింఛన్లను పరిచయం చేసిన ఘనత ఎన్టీఆర్ తేదేపా అని కొనియాడారు. ఈ నాలుగు వేలు పింఛన్లు అధిక మొత్తం పెంచింది చంద్రబాబేనన్నారు. ఈ కార్యక్రమంలో రామాంజి, పవన్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్ష రైతన్నకు రక్ష



తొండూరు,మేజర్‌న్యూస్ : రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని తొండూరు మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని రైతులందరూ భూసార పరీక్షల కోసం మట్టి సేకరణ కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని ప్రతి గ్రామంలో ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములను బట్టి నమూనాలను వ్యవసాయ అధికారులకు అందిస్తే వారు పరీక్షలు జరిపి ఎలాంటి పంటలు వేసుకోవాలో చూస్తారన్నారు తద్వారా పంటలు దిగుబడి అధికంగా వచ్చి లాభాలు పొందుతారు అన్నారు ప్రతి రైతు భరోసా కేంద్రానికి 75 చెప్పునా మట్టి నమునా పరీక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది కనుక రైతులు భూసార మట్టి పరీక్షలు ఆసక్తి ఉన్న రైతులు ఆ రైతులు యొక్క ఆధార్ కార్డు తీసుకొని వచ్చి రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకొని మట్టి నమూనా సేకరించి మట్టి పరీక్షలు చేసుకోవాలని అన్నారు.

# ప్రతి ఒక్కరూ పరి శుభ్రతను పాటించాలి

## డిఎంహెచ్ఓ నాగరాజు



కడప ఐటిఐ సర్కిల్, మేజర్‌న్యూస్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల వైద్యా ధికారులకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ సమావేశం నిర్వహిం చడం జరిగినది. ఈ సమావేశము నందు డాక్టర్ శశి భూషణ్ రెడ్డి డి.పి.ఎమ్.ఓ. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జూలై 1వ తేదీ నుండి ఆగస్టు 31 వ తేదీ వరకు నిర్వహించబడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికా రులను ఉద్దేశించి డయేరియా అనేది కలుషితమైన ఆహారం నీరు తీసుకోవడం వల్ల వస్తుందని, ఈ వ్యాధి సోకితే అధిక నీళ్ల-విరోచ నాలతో మనిషి నిరసించి పోతాడని చెప్పారు. కాబట్టి మీ మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందితో డయేరియా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రతి ఇంటికి వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్స్ జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. పంచాయితీ సిబ్బందితో కలిసి త్రాగునీటి సరఫరాలో అనగా వాటర్ ట్యాంకుల నుండి నీటిని కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించాలని సూచించారు పైప్ లైన్ ఏదైనా లీకేజ్ ఉన్నట్టయితే వాటిని వెంటనే బాగు చేయించాలన్నారు ప్రతి బుధవారం వాటర్ టెస్ట్ చేయాలని చెప్పారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు, ప్రతి విలేజ్ హెల్త్ క్లినిక్ నందు ఓ.ఆర్.ఎస్. జింక్ కార్నర్ ఏర్పాటు చేయవలెనని తెలియ జేశారు.డాక్టర్ ఉమామ హేశ్వర కుమార్ డి.ఐ.ఓ. జులై 1 నుండి ఆగస్టు 31 వ తేదీ వరకు ఆరోగ్య శాఖ అధికారి స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నినాదముతో ప్రతి గ్రామములోనూ డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రతి శుక్రవారం డ్రైడే-ఫ్రైడే ఆవశ్యకత గురించి అవగాహన కల్పించవలననియు, డయేరియా తో మరణాలు జరగకుండా చూడవలెనని తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ శశి భూషణ్ రెడ్డి డి.పి.ఎమ్.ఓ., డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ డి.ఐ.ఓ., డాక్టర్ రవిబాబు డి.ఎల్.ఎ.టి.వో., ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, రమేష్ రెడ్డి, ఎస్.ఓ డి.రమణమ్మ డిప్యూటీ డెమో హాజరయ్యారు

# ఆకస్మిక తనిఖీ చేసిన సర్పంచ్, మండల స్పెషల్ ఆఫీసర్



పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ : ప్రభుత్వం పిల్లల కొరకు పౌష్టిక ఆహారం అందించే దిశగా కోట్ల రూపాయల ధనాన్ని ఖర్చు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా సోమవారం నుండి శనివారం వరకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందివ్వాలి. ఈ క్రమంలో బుధవారం పోరుమామిళ్ల పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సరిగా అమలు అవుతుందా లేదా అని పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ మరియు మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పాఠశాలలో వంటలు రుచికరంగా చేస్తున్నారా లేదా అని వారు పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ లేత్ మిషన్ షరీఫ్, చెన్ను రమణ, చొక్కం లక్ష్మణ రావ్, మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమ్మో...దొంగలా.. భయంతో హడలెత్తిపోతున్న ప్రజలు



పులివెందుల అర్బన్, మేజర్‌న్యూస్ : పులివెందుల నియోజకవర్గంలో దొంగలంటే భయపడే పరిస్థితి నెలకొంది. మొన్న పులివెందులలోని ప్రశాంతి నగర్‌లో అల్లా బకాష్ అనే వ్యక్తి బక్రీద్ పండుగ సందర్భంగా అదే పులివెందులలో ఉన్న వారి బంధువుల ఇంటికి వెళ్ళగా విషయం తెలుసుకున్న దొంగలు గుట్టు చప్పుడు కాకుండా ఇంటి తాళాన్ని పగులకొట్టి ఇంటి బీరువాలో ఉన్న దాదాపు 30 తులాల బంగారం, కొంత నగదును దోచుకెళ్లారు. అది మరువక ముందే రికవరీ కాకముందే మరుసటిరోజే బిఎస్ఎన్ఎల్ ఆఫీసు సమీపంలో ఉన్న టీ దుకాణం, కిరాణా దుకాణం, చికెన్ దుకాణాల్లో ఉన్నకాడికి...అందిన కాడికి దోచుకెళ్లారు. ఇది కూడా మరువక ముందే సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామ సమీపంలో ఉన్న ఓ తోట లో ఉన్న రేకుల షెడ్డు ఇంటి తాళాన్ని పగులకొట్టి అందులో ఉన్న వాటిని తీసుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. ఇలా ఒకదాని ఒకటి జరుగుతున్నా.. వాటిని నిరోధించాల్సిన పోలీసు అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. ఎందుకో మరి సమయం లేకనా.. శ్రద్ధ పెట్టలేకనా... ఏమో మరి.. మొత్తానికీ బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇప్పటివరకు జరిగిన దొంగతనాలలో రికవరీ రేట్ కూడా పెద్దగా ఏమీ లేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు చొరవ చూపి బాధితులకు న్యాయం జరిగేలా పోయిన సొమ్మును తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు వాపోతున్నారు. అలాగే రాత్రివేళల్లో పోలీసుల గస్తీని కూడా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పులివెందుల వాసులు పేర్కొంటున్నారు.

# రెవెన్యూ అధికారుల అక్రమాలపై చర్యలు తీసుకోరా..!

## మట్టి తవ్వకాల్లో రెవిన్యూ అక్రమ అధికారులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలి
## తహసీల్దార్ ఆఫీస్ వద్ద నగ్న ప్రదర్శన



కలసపాడు మేజర్ న్యూస్ : కలసపాడు తాసిల్దార్ కార్యాలయం వద్ద ఎగువ తంబళ్లపల్లె వీఆర్వో ను పిడుగు పల్లె వీఆర్వో ను వెంటనే సస్పెండ్ చేయాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యుడు డి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కలసపాడు మండలంలోని తదితర చెరువులలో గత నెలలో మట్టి త్రవ్వకాలపై బద్వేల్ ఆర్డీవో కు మరియు జిల్లా కలెక్టర్ కు తాసిల్దారు. పై మరియు విఆర్ఓ లపై ఫిర్యాదు చేయడం జరిగినది బద్వేల్ ఆర్డీవో వచ్చి ఎంక్వయిరీ చేసి వెళ్లారు కానీ కలసపాడు మండల తాసిల్దార్ పై వీఆర్వోలపై ఎటువంటి చర్య లేదు ఇటీవల కాలంలో పిడుగుపల్లె వద్ద ఒక పేద రైతు పారం కట్టలు లోడ్ వేసుకొని వెళ్తుండగా ఈనెల 21వ తారీఖున తాసిల్దారు విఆర్ఓ ఆ లారీని ఆపి దానికి వారి సొంతంగా చలానా వేసి వైకాపా నాయకు లు తాసిల్దార్ ఆఫీస్ నందు పంచాయతీ చేసి లారీని వదిలిపెట్టడం జరిగినది సంబంధించిన చలానా డబ్బులు వీరి జోబులోకి వెళ్లినట్లుగా మండలంలోని ప్రజలు కోడై కూస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎగువ తంబళ్లపల్లె విఆర్ఓ ను పిడుగుపల్లె విఆర్ఓను తాసిల్దార్‌ను విరువురుపై చర్య తీసుకొని వీరిని సస్పెండ్ చేయాలని ప్రవీణ్ కుమార్ అన్నారు లేని పక్షంలో ధర్నాలు రాస్తారోకోలు చేసి ఆఫీస్ కి తాళాలు వేసి ధర్నాను ఉద్రిక్త చేస్తాము అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కలసపాడు మండల కార్యదర్శి జి. సుదర్శన్ ఆవాస్ మండల అధ్యక్షుడు హుస్సేన్ పీరా, కార్యదర్శి చిన్న నాగురువల్లి, సుబ్బరాయుడులు పాల్గొన్నారు.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమరవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం వేడుకలో ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంభాష**



కడప, మేజర్‌న్యూస్ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మంచి భవిష్యత్తు ఉంటుందని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి సలీం భాష అన్నారు, బుధవారం కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ మరియు ఎన్ఫోర్స్మెంట్ పోలీసు వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమాల రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం నిర్వహించారు, ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం భాష మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నేటి యువత హెరాయిన్, కోకాయిన్, ఆల్కహాల్ వంటి మత్తు పదార్థాలకు బానిసై, అనేక చెడు అలవాట్లు నేర్చుకోవడం యువత అనేక రకాలైన నాడీ సంబంధ మరియు మానసికమైన వ్యాధులకు గురి కావడం వల్ల తన అమూల్యమైన జీవితాన్ని పాడు చేసుకోవడమే కాకుండా ఇతరులను నాశనం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని అన్నారు, కావున యువతకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చాలా అవసరమని ఈ కార్యక్రమాల ద్వారా యువత మేల్కొని చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి భవిష్యత్తు కోసము తమ కాలాన్ని వినియోగించాలని విద్యార్థులకు తెలిపారు, అనంతరం నష్టాలను స్టెప్ సీఈఓ సాయి గ్రేస్ మాట్లాడుతూ ప్రభుత్వము మాదకద్రవ్యాల భారి నుండి యువతను కాపాడటానికి అనేక అవగాహన కార్యక్రమాలను కల్పిస్తున్నదన్నారు, అందులో భాగంగానే కడప యువజన సర్వీసెస్ శాఖ జిల్లాలోని యువతీ యువకులందరికీ ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతను సన్మార్గంలో నడిపించే బాధ్యత చేపడుతున్నామని అన్నారు, డ్రగ్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ నుండి విచ్చేసిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం గురించి, వాటి అక్రమ రవాణా గురించి, ఇలాంటి రవాణా చేసే వారి మీద, వ్యసనాలకు గురి అయిన వారి మీద మరియు ఈ వ్యసనాలకు బానిస అయ్యి సమాజంలోని ప్రజలను హింసిస్తున్న వ్యక్తుల మీద చట్టపరంగా ఎలాంటి చర్యలు చేపడతాము అని విద్యార్థులకు వివరించారు, అనేక దేశాలతో పాటు భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో తెలుగు రాష్ట్రాలలోని వివిధ జిల్లాలలో ఈ మాదకద్రవ్యాల దుర్వినియోగం ఎక్కువగా ఉన్నదన్నారు, కావున వీటిని అరికట్టకపోతే యువతను ఈ మత్తు పదార్థాల నుండి మళ్ళించకపోతే యువశక్తి నిర్వీర్యమై కోట్లాది ప్రజల జీవితాలు నాశనమైపోతాయి కావున ప్రపంచంలోని ప్రతి యువతి యువకులు కూడా మేల్కొని ఈ మానవ జీవితాలను ఈ మాదక్కద్రవ్య ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో సహా పెకిలించి వేయాలి అప్పుడే భారత దేశ భవిష్యత్తుతో పాటు ప్రపంచ భవిష్యత్తు కూడా బాగుంటుందన్నారు, ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి గురువిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి శచీదేవి, ఎన్ సి సి అధికారిని డాక్టర్ బి స్వరూప, ఉమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ ఎన్ నాగరత్నమ్మ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అడ్మిషన్ల పక్రియ కన్వీనర్‌గా అమరేంద్ర



వేంపల్లె మేజర్‌న్యూస్: ఆర్జీయూకేటీ పరిధిలోని ఆయా ట్రిపుల్ ఐటీలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను జరిగే అడ్మిషన్ల పక్రియకు అధ్యాపకుడు డాక్టర్ అమరేంద్ర కుమార్ సంద్రాను ఆర్జీయూకేటీ అధికారులు నియామించారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న అమరేంద్ర కుమార్‌ను అడ్మిషన్లు కన్వీనర్‌గా నియామకం చేయడం పట్ల ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో అమరేంద్ర కుమార్ సంద్రా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ గా, ఎగ్జామ్స్ కంట్రోలర్ గా, ఏఓగా పని చేయడం జరిగింది. అడ్మిషన్లు పక్రియను సమర్థవంతంగా చేపడుతామని కన్వీనర్ అమరేంద్ర తెలిపారు.

# ఎన్నికల నిధుల స్వాహా పై విచారణ జరపాలి

**యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ డిమాండ్**



బద్వేలు మేజర్‌న్యూస్:సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కొరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బద్వేలు నియోజకవర్గానికి కేటాయించిన నిధులలో దాదాపు కోటి రూపాయలు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం బద్వేలులోని స్థానిక ఎన్జీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదన విజయ కుమార్ మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో ఎన్నికల నిర్వహణ కొరకు ఎన్నికల కమిషన్ కోటి 80 లక్షల రూపాయలు మంజూరు చేసిందన్నారు ఈ నిధులతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేయడంతో పాటు, ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి రెమ్యూనరేషన్ కూడా చెల్లించాలన్నారు. అయితే ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో రెమ్యూనరేషన్ చెల్లించలేదని ఆయన ఆరోపించారు. ఎన్నికల విధులకు గాను రిజర్వుగా నియమించబడిన సిబ్బందికి కూడా ఏ ఒక్కరికి రెమ్యూనరేషన్ చెల్లించకుండా ఎగనామం పెట్టారని విమర్శించారు వీరితోపాటు రాత్రనకా, పగలనకా కష్టపడిన రెవిన్యూ సిబ్బందికి సైతం పూర్తిస్థాయిలో రెమ్యూనరేషన్ చెల్లించలేదన్నారు ఎన్నికల నిధులకు ఆడిట్ లేని కారణంగా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపించారు. పెద్ద ఎత్తున తప్పుడు బిల్లులు సమర్పించి నిధులను కాజేశారనే ఆరోపణలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కష్టపడి పని చేసిన సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లించకుండా ఇలా లక్షలాది రూపాయలను అధికారులు స్వాహా చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో పాటు రిజర్వులో ఉండి, డ్యూటీలు కేటాయించబడని ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూడా రెమ్యునరేషన్ చెల్లించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, ట్రెజరర్ ఎ.గుర్రయ్య, గోపవరం మండల అధ్యక్షుడు వీరదాసరి క్రిస్టఫర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

# నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి




చింతకొమ్మదిన్నె, మేజర్‌న్యూస్ : కడప జిల్లా ముద్దనూరు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగి ప్రాణాపాయ స్థితిలో ఉండడానికి గల కారణమైన హాస్టల్ హాస్టల్ అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్లో ఉండే విద్యార్థులకు నాసిరకమైనటువంటి ఇడ్లీ రవ్వ విద్యార్థులకు పెట్టడం వల్ల ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు అస్వస్థకు గురికావాల్సి వచ్చిందని, హాస్టల్ అధికారి మాత్రం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ, వారి సంక్షేమాన్ని గాలికి వదిలేసారని వారు విమర్శించారు. పాఠశాల తెరిచి నెల కూడా కాక ముందే ఇలాంటి విషాద ఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. ఒక పక్క ప్రభుత్వాలు మాత్రం సంక్షేమ విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని చెబుతున్న కూడా హాస్టల్ అధికారులు మాత్రం విద్యార్థులకు నాసిరకమైన ఆహారాన్ని అందిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాసి రకమైన సరుకులు టెండర్ ద్వారా వస్తున్న కూడా హాస్టల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులకు అస్వస్థకు కారణమైన వార్డెన్ని వెంటనే సస్పెండ్ చేసి టెండర్ సరుకులను వెంటనే ఆపాలని లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# కారు బైక్ ఢీ వ్యక్తికి తీవ్ర గాయాలు



పులివెందుల క్రైమ్, మేజర్ న్యూస్ : పులివెందుల పట్టణ పరిధిలో కారు బైక్ ఢీ కొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన సంఘటన పులివెందులలో చోటు చేసుకుంది. వివరాలకు వెళితే పులివెందుల అంబకపల్లి రోడ్ లో కారు బైకు ఢీ బైక్ లో ప్రయాణిస్తున్న నల్లపురెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్ టీచర్ భాషగా గుర్తించారు. అతనికి తీవ్ర గాయాలు అయినందున హుటాహుటిగా వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది ఈ విషయాలపై పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని విచారణ చేయాల్సి ఉందని అన్నారు.

# శాశ్వత నిత్యాన్న పథకానికి విరాళాలు



చక్రాయపేట, మేజర్‌న్యూస్ : చక్రాయపేట మండలం శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం, గండి క్షేత్రములో బుధవారం శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ప్రొద్దుటూరు పట్టణం రాజా బృందావనం ప్యాలెస్ వాస్తవ్యులు లింగాల మల్లా రెడ్డి ఎరికలమ్మ జ్ఞాపకార్థం వీరి కుమారుడు లింగాల మల్ రెడ్డి సతీమణి మంగమ్మ 1,11, 116 రూపాయల చెక్కును ఆఫీస్ సూపరిం టెండెంట్ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ రవిచంద్రా రెడ్డిలకు అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా దాతలకు ఆలయ ప్రధాన అర్చకులు చే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తు కాలరాస్తున్న మత్తుపదార్థాలు

**విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి**




జమ్మలమడుగు. మేజర్‌న్యూస్ : విద్యార్థుల బంగారు భవిష్యత్తును మత్తు పదార్థాలు దొరలవాట్లు కాలరాస్తున్నయని వారి జీవితాలనుఅధోగతిపాలు చేస్తున్నాయని జమ్మలమడుగు బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బూతమాపురం సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా జమ్మలమడుగు పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు, అడ్వకేట్లు, ఎక్సైజ్ పోలీసులు మరియు స్థానిక పోలీసులు ప్రభుత్వ జూనియర్ కాలేజీ యాజమాన్యం తో కలిసి జమ్మలమడుగు పట్టణంలోని జూనియర్ కాలేజీవిద్యార్థులతో పట్టణంలో మాదక దవ్యాల వినియోగం వల్ల జరిగేఅనర్థాలు మరియు దుష్పరిణామాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు మాదక ద్రవ్యాలకు బానిసలు అవ్వడం వల్ల వారి బంగారు భవిష్యత్తు దుర్భరంగా మారుతుందని, భవిష్యత్తుతో పాటు వారి ఆరోగ్యం కూడా చిన్న వయసు లోనే క్షీణించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత పదవులు అధిరోహించాలని, మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లతా, ఎస్ఐ సుబ్బారావు, బార్ అసోసియేషన్ అడిషనల్ సెక్రటరీ నాగార్జున రెడ్డి, సభ్యులు, అడ్వకేట్లు సంధ్య, సురేంద్రా రెడ్డి, ఓబులేసు, కొత్తమాస్ భాస్కర్, జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

# కౌన్సిల్ ఆమోదం లేకుండా పేరు మార్చడం సరైన పద్ధతి కాదు

## ప్రభుత్వం మారగానే పేర్లు మార్చడం సరికాదు మున్సిపల్ ఇన్‌చార్జ్ వై.ఎస్. మనోహర్ రెడ్డి



పులివెందుల అర్బన్, మేజర్‌న్యూస్ : పులివెందుల కూరగాయల మార్కెట్ కు మునిసిపాలిటీ కౌన్సిల్ ఆమోదం లేకుండా కూటమి నాయకులు పేరు మార్చడం సరైన పద్ధతి కాదని మునిసిపల్ వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ పులివెందుల కూరగాయల మార్కెట్ ను గత ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అప్పట్లో స్థానికంగా ఉన్న మార్కెట్ వ్యాపారస్తులు , ప్రజలు మార్కెట్‌కు వైఎస్సార్ పేరు పెట్టాలని విన్నవించడం తోనే అప్పట్లో మున్సిపాలిటీ కౌన్సిల్ ఆమోదించి మార్కెట్‌కు దివంగత వైఎస్సార్ పేరు పెట్టడం జరిగిందన్నారు.పులివెందుల మున్సిపాలిటీనే గాక నియోజకవర్గ అభివృద్ధి అప్పట్లో వైఎస్సార్, ఇప్పట్లో జగన్మోహన్ రెడ్డి హయాంలో జరిగిందన్నారు. కానీ టీడీపీ హయాంలో ఏనాడూ పులివెందులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేసిన పాపా న పోలేదన్నారు. టిడిపి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే మీ ప్రభత్వ హయాంలో అభివృద్ధి చేసి చూపాలన్నారు. ఇప్పుడు అభివృద్ధి చేసిన వాటికి మీకిష్టమైన పేర్లు పెట్టుకోవచ్చు అంతే కాని వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన, నిర్మించిన వాటికి ప్రభుత్వం మారగానే పేర్లు మార్చడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వాలు మారడం రాజకీయాల్లో సహజమని కానీ చేసిన అభివృద్ధి శాశ్వతమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఖాదర్, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మీ ప్రసన్న, రాజేశ్వరి, రజియా, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి డేనియల్ బాబు, కో ఆప్షన్ చంద్రమౌళి, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైకాపా నాయకులు వీరారెడ్డి, రవి బొట్టు రాము, తదితరులు పాల్గొన్నారు.

# సుండుపల్లె హై స్కూల్‌ని సందర్శించిన డీఈఓ శివ ప్రకాష్ రెడ్డి



సుండుపల్లె, మేజర్‌న్యూస్ : అన్నమయ్య జిల్లా డీఈఓ శివ ప్రకాష్ రెడ్డి ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టి సుండుపల్లెని సందర్శించడం జరిగింది ముఖ్యంగా హై స్కూల్ ప్లస్ లో ఏర్పాటు చేసిన ఎంపీసీ మరియు బైపీసీ గ్రూపులతోపాటు ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో కూడా మాట్లాడి వారికి చక్కగా చదువుకోవాలని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు అలాగే సుండుపల్లి ఉన్నత పాఠశాల అనేక సంవత్సరాల నుంచి ఉన్నత ప్రమాణాలతో విద్యార్థులు చక్కని విద్య అందిస్తున్నారని చక్కని ఫలితాలు కూడా సాధిస్తున్నారని కొనియాడారు విద్యతోపాటు క్రీడల్లో కూడా ముఖ్యంగా సాఫ్ట్ బాల్ మరియు బేస్ బాల్ లలో రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయి పోటీలకు విద్యార్థులు వెళ్లడం అభినందనీయమని అందుకు కృషి చేసిన పీడీలు రవీంద్రనాథ్రాజు మరియు రాధా రాణి గార్లను అభినందించారు ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ తో పాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు బోధన్యత సిబ్బంది పాల్గొన్నారు

# ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డిని కలిసిన ఆంధ్ర ప్రదేశ్ నర్సెస్, స్ట్రగుల్ కమిటీ సభ్యులు



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:ఆంధ్రప్రదేశ్ స్టాఫ్ నర్సెస్, స్ట్రగుల్ కమిటీ నియోజకవర్గ శాసనసభ్యులు ఎన్నిక అయినా నంద్యాల వరదరాజులు రెడ్డిని శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు సమస్యల పరిష్కారం కోరుతూ, నియోజకవర్గ శాసనసభ్యులు నంద్యాల వరదరాజులు రెడ్డి ని ఆంధ్ర ప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కామిటి ఆధ్వర్యంలో కాంటాక్ట్ స్టాఫ్ నర్సెస్ సమస్యల పై వినతి పత్రం అందించడం జరిగింది ఎంఎల్ఏ, ప్రత్యేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి కాంటాక్ట్ స్టాఫ్ నర్సులు సమస్యలను వివరించి సమస్యల పరిష్కారం చేసేలా చేస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సెస్ లక్ష్మి, సుధ, సువర్ణ, అరుణ, సుబ్బమ్మ, రమని, రాణి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యను తెలిపిన మండల వ్యవసాయ అధికారి: చంద్రశేఖర్ రెడ్డి



జమ్మలమడుగు మేజర్‌న్యూస్: బుధవారం జమ్మలమడుగు గ్రోమోర్ సెంటర్ నందు “మన గ్రోమోర్ రైతు సంబరాల,” కార్యక్రమం నిర్వహించారు. గత రబీ సీజన్లో మన గ్రోమోర్ కాంప్లెక్సో ఎరువులు కొన్న రైతులకు లక్కీ డిప్ ద్వారా టీవీఎస్ మోపెడ్ బైకులు, గోల్డ్ కాయిన్స్ ఇవ్వడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ఆపరేషన్ హెడ్ నవీన్ రెడ్డి పత్రిక ముఖంగా తెలియజేశారు. కార్యక్రమంలో నవీన్ రెడ్డి మాట్లాడుతూ కోరమండల్, ఐఐటి బాంబే తయారుచేసిన లిక్విడ్ డిఏపి (మెటా డిఏపి) ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ప్రాముఖ్యతను తెలియ జేశారు. మన గ్రోమోర్ నూతన సేంద్రియ ఉత్పత్తి “గ్రోవైబ్” ను ఏవో చంద్రశేఖర్ రెడ్డి, నవీన్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రోమోర్ జోనల్ హెడ్ రఘునాథరెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ చక్రధర్, ఏరియా మేనేజర్ గౌస్ మొద్దీన్, గంగయ్య పాల్గొన్నారు.

# కురబలకోట దేశంలో కుమ్మలాటేనా..!

కురబలకోట మేజర్‌న్యూస్: కురబలకోట తెలుగుదేశంలో వర్గ పోరు ఎక్కువవుతుంది.. నాయకులు, కార్యకర్తలు మూడు వర్గాలుగా ఉంటూ అటు మండల అధికారులు కార్యకర్తలకు చులకన భావం ఏర్పడే పరిస్థితులు తీసుకొస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే బాటలోనే ప్రస్తుత నాయకుడు జయచంద్ర రెడ్డి వర్గాలను ఏకం చేయకుండా ఒక వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నాడని నాయకులు మదనపడుతున్నారు. అంతేకాకుండా డబల్ గేమ్ ఆడిన జంగా రాఘవరెడ్డి, జంగా ఎల్లారెడ్డి, ముదివేడు వైజి బ్రదర్స్,కామకోటి ప్రసాద్ రావు, తుమ్మ చెట్ల పల్లి సూరి, వంటి వారికే ప్రాధాన్య ఇస్తూ పార్టీ కోసం కష్టపడిన వారిని దూరంగా పెడుతున్నాడని విమర్శలో వెల్లు వెతుతున్నాయి.. అందు వలన ఇక్కడ పార్టీ ఓడిపోవాల్సి వచ్చిందంటున్నారు.. అందర్నీ కలుపుకొని పార్టీని బలోపేతానికి పాటు పడాల్సిన నాయకులు భ్రష్టు చేయకుండా ఉండాలని కోరుతున్నారు.. ఒంటెద్దు పోకడ మానుకోవాలని కార్యకర్తలు, నాయకులు,అభిప్రాయపడుతున్నారు.. పైనున్న వారిలో నాయకులుగా చలామణి అవుతున్న వారి సొంత కుటుంబ సభ్యులు సైతం వారి మాట వినే స్థితిలో లేరు.. వారి కుటుంబ సభ్యుల చేత ఓట్లు వేయించలేని అసమర్థ నాయకులుగా మిగిలిపోయారని విమర్శలు బారిగా వస్తున్నాయి.. ఇటువంటి నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడంపై కార్యకర్తలు నాయకులు కీలక నాయకుడి పై అసంతృప్తి వెళ్ళగకుతున్నారు.. డ్రామాలాడుతున్న నాయకులను దూరం పెడితే చాలా బాగుంటుందని పలువురు కోరుతున్నారు..

# అమృత నగర్ స్థలాలకు మౌలిక వసతులు కల్పించాలి



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్: కొత్తపల్లె పంచాయతీ పరిధిలో అమృత నగర్ స్థలాలకు మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి ని స్థలాలు తీసుకున్న బాధితులు కలిశారు. అనంతరం సిపిఎం కార్యదర్శి సత్య నారాయణ మాట్లాడుతూ 2008లో మరియు 2018లో దాదాపుగా 2500 మందికి స్థలాలు ఇవ్వడం జరిగింది దాదాపుగా 15 సంవత్సరాల కావస్తుంది అయితే అక్కడ మౌలిక వసతులు కల్పించలేదు అక్కడ కరెంటు మంచినీరు రోడ్లు హౌసింగ్ లోన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి ని ఆయన కార్యాలయం లో స్థలాలు తీసుకున్న లబ్ధిదారులందరూ కలిసి వినతిపత్రం ఇచ్చారు. సొంత డబ్బులు లక్షలు ఖర్చుపెట్టి బేస్‌మట్టాలు, కొందరు స్లాబ్ లెవల్ వరకు వేసుకోవడం జరిగింది, మౌలిక వసతులు లేవు ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులు ఆగండి తర్వాత మీ సమస్య పరిష్కరిస్తాము ఇప్పుడు ఎవరైనా ఇల్లును పూర్తి నిర్మించుకొని ఉంటే అటువంటి వారికి కరెంటు ఏర్పాటు చేయమని విద్యుత్ డి ఈ శ్రీనివాసరెడ్డి కి ఫోన్ చేసి చెప్పడం జరిగింది. వెంటనే ఏఈ ని అమృత నగర్ స్థలాలను పరిశీలించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఆయనకు అక్కడికి వచ్చిన ప్రజలు ధన్యవాదములు తెలిపారు ఎమ్మెల్యేని కలిసిన వారిలో హసీనా. పుష్పలత, నరసింహులు, పెంచల్‌రెడ్డి, హరి, డివైఎఫ్ఐ నాయకుడు విశ్వనాథ్, చంటి, బాబు, మల్లికా, భాను, పార్వతి, గోవిందమ్మ, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కోడూరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## చిట్వేలి మండలంలో పర్యటించిన ముక్కా రూపానంద రెడ్డి



చిట్వేలి, మేజర్‌న్యూస్ : అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం కోడూరుని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించుకున్న తెలుగుదేశం పార్టీ రైల్వే కోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపనంద రెడ్డి కార్యాచరణలోకి దిగి అధికారులను పరుగులెత్తిస్తున్నారు కోడూరు చిట్వేలి రోడ్డు పనులను ఆయన ప్రత్యేకంగా పరిశీలించి అభివృద్ధి శరవేగంగా జరగాలే కానీ ఎక్కడ అలసత్వం వహించిన సహించేది లేదన్నారు. అలాగే సిద్ధారెడ్డిపల్లి దగ్గర ఉన్న వంతెనను పరిశీలించి ఇక్కడ అవసరమైతే ప్రత్యేక అనుమతులు మంరు చేయిస్తానన్నారు. తనతో పాటు మండల నాయకులు అందర్నీ వెంటబెట్టుకుని ప్రత్యేకంగా అధికారులతో కలిసి పరిశీలించారు. పనులలో ఆలస్యం అయ్యే ప్రశ్న లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాజకీయాలు ముఖ్యం కాదు అభివృద్ధి ముఖ్యం అని నమ్మిన రూపానంద రెడ్డి కోడూరులో కాలువ పనులు అలాగే బస్టాండ్‌ను అభివృద్ధి పరచాలని రవాణా శాఖ మంత్రిని కలిసి కొరుతామని జరుగుతున్న పనులు ఆలస్యం కాకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నాడు. చూస్తే అభివృద్ధికి ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నాడో అర్థమవుతుంది రాజకీయాల్లోకి రాకముందు కూడా ప్రజలకు ఎంతో సేవ చేసినటువంటి వ్యక్తి ఎలాంటి స్వార్థం లేని వారు రాజకీయాల్లోకి వస్తే ఇలాగే ఉంటుంది గత 20 సంవత్సరాలలో కోడూరు నియోజకవర్గంలో ఉన్న శాసనసభ్యులు చేసిన అభివృద్ధి శూన్యమని ప్రజలు చర్చించుకుంటున్నారు రూపానంద రెడ్డి ఎలాంటి పరిస్థితులలో జరుగుతున్న పనులు ఆలస్యమయ్యే ప్రశ్న ఉండకూడదని నాకు రాజకీయాలు ముఖ్యం కాదు అభివృద్ధి ముఖ్యమని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గము యువ నాయకులు రాజు గుంట సర్పంచ్ గుత్తి నరసింహ, జనసేన నాయకులు తాతం శెట్టి నాగేంద్ర , జోగినేని మనీ మాదాసు, నరసింహ, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పోలోపల్లి ఎంపీటీసీ శివ, చిల్లా వాండ్లపల్లి చంగల్ రాయుడు, మద్దూరి మన్మధ, తెలుగుదేశం జనసేన పార్టీ కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా నడివీధి గంగమ్మ జాతర



మదనపల్లె,మేజర్ న్యూస్ : పట్టణంలోని నడివీధి గంగమ్మ జాతర మంగళ,బుధవారాల్లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ జాతరకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్య అతిథిగా హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు. మాజీ టౌన్ బ్యాంక్ ఛైర్మన్,టిడిపి సీనియర్ నాయ కులు నాదెళ్ల విద్యాసాగర్ ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి,పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విందులో పాల్గొన్నారు. షాజహాన్ బాషా మాట్లాడుతూ నడివీధి గంగమ్మ జాతరను ఇక్కడి ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ ఏడాది గంగ జాతరను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని కొనియాడారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనం తరం నాదెళ్ల విద్యాసాగర్ మాట్లాడుతూ తమ ఆహ్వానం మేరకు గంగ జాతర కు విచ్చేసిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.అందరి కష్టాలు తెలిసిన నాయకుడు ఎమ్మెల్యేగా విజయం సాధించడం నియోజకవర్గం ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బరీ, సోద రుడు జంషీర్, బొమ్మనచెరువు శ్రీరాములు, ఆర్.జె.వెంకటేష్, జంగాల శివరాం రాయల్, జంగాల వెంకటరమణ,గంగారపు నవీన్ చౌదరి,నాగూర్ వలి, షంషీర్, గంగారపు రామూర్తి నాయుడు,కొడవలి కరుణశేఖర్,జోళపాలెం దేవేంద్ర (చిన్ని),బీదం గురునాథ్ యాదవ్ (చిప్పిలి), జీవి నాయుడు,పులి స్వరూప్,ఎంపీటీసీ దేవేంద్ర,కమలామ్రి కృష్ణ, సంగం హరి, శీనా, నాదెళ్ల శివ,పూలకుంట్ల హరిబాబు,ఖాజా హుస్సేన్,శీనా నాయక్ పాల్గొన్నారు.

## కామకుంట రెవిన్యూ పొలాన్ని దళితులకు పంచాలి



బి.కోడూరు మేజర్ న్యూస్: కాముకుంట రెవెన్యూ పొలంలో ఉన్న ప్రభుత్వ భూమిని దళితులకు ఇవ్వాలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.వెంకటేష్ కోరారు బి.కోడూరు మండలం కాముకుంట రెవిన్యూ పొలం, వేముకుంట రెవెన్యూ పొలం సర్వేనెంబర్ లో రెవెన్యూ ప్రభుత్వ భూమి వందల ఎకరాలు ఉన్నది ఈ భూమిలో గతం 2016 సంవ త్సరంలో మేక వారి పల్లె నరసింహపురం పెద్దలపల్లె పాయలకుంట్ల మరియు కొన్ని దళిత కాలనీవాసులకు భూములు ఇవ్వాలని భూ పోరాటం చేసి కంపచెట్లు కొట్టించి చదును చేయడం జరిగింది ఈరోజున ఆభూములను పరిశీలిస్తే అనేకమంది నాయకులు భూ కబ్జా చేసి మామిడి చెట్లు టెంకాయ చెట్లు చీనిచెట్లు వందల ఎకరాలలో వేసి బినామి పేర్లతో దొంగ డి.పారాలు పాసుబు క్కులు తయారు చేపించుకొని,ఆక్రమించుకొని ఉన్నారు ఇదే భూమి గతంలో బి.కోడూరు మండలం తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాలు చేసి ఆందోళన చేసి ఆ భూములో ఈ భూమి ప్రభుత్వ భూమి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేపించడం కూడా జరిగింది ఆ బోర్డులు పీకి వేసి ఈరోజున ఆ భూములలో పోతే అనేకమంది భూములను కబ్జా చేసి పేదల నోట్లో మట్టి కొట్టి చేయటం లక్షల రూపాయలకు అమ్ముకుంటూ ఉన్నారు మరియు 200 ఎకరాలు మిగులు భూమిని ఇప్పటికైనా మేకవారిపల్లి పెద్దల పల్లి నరసింహ పురం పాయలకుంట్ల బి.కోడూరు దళితులకు ఆభూములను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో అదే భూములలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూపోరాటం చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరిం చారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు నరసింహులు గుర్రయ్య పెంచలయ్య అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



ములకలచెరువు,మేజర్ న్యూస్: ములకలచెరువు మండల కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యా ల అక్రమ వినియోగ వ్యతిరేక దినం సందర్భంగా ములకలచెరువు ఎస్ ఈ బి సీఐ రామ్మోహన్, సీఐ తమ్మిశెట్టి మధు ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , విద్యార్థులు పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు కలసి హై స్కూల్ కాలేజీ నుండి మూడు రోడ్లు కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేఖంగా పోలీసులు భారీ మానవ భారంగా నిలబడి నినాదాలు చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థులు ఎవరూ కూడా మాదక ద్రవ్యాల జోలికి పోకుండా ఉండాలని, అలానే మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం పోలీస్‌శాఖకు అందించడంలో తమవంతు పాత్ర అందరూ పోషించాలని కోరారు. అలానే సమాచారం అందించే వారి వివరాలు గోప్యం గా ఉంచుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై తిప్పేస్వామి, పోలీస్ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి కృష్ణారెడ్డి,ఆదర్శ పాఠశాల ప్రిన్సి పల్ కవిత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

### ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్



కడప మేజర్ న్యూస్ విద్యా ర్థులకు నాణ్యతగల భోజనం పెట్టా లని ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు, బుధవారం కడప నగరంలోని ప్రభుత్వ గాంధీ నగర్ ఉన్నత పాఠశాలలో మధ్యా హ్నం భోజనంను పరిశీలించిన రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నాణ్యత పెంచాలని అన్నారు, జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉడికి ఉడకని అన్నం, నీళ్ల రసంతో తింటూ ఇబ్బంది పడుతున్నారన్నారు, మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉడకని అన్నం నీసువాసన గుడ్డు తినడంవలన విద్యార్థులకు కడుపు నొప్పి వచ్చి అనారోగ్యం పాలయ్యే పరిస్థితి ఉందన్నారు, దీనివలన ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేసినప్ప టికీ నాణ్యత లేని వలన 100 మందిలో 30 మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్ తెచ్చుకుంటున్నారన్నారు, దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి పరిశీ లించి మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేసే వాళ్ళందరినీ పిలిపిం చి చర్యలు తీసుకోవాలన్నారు, జిల్లా విద్యాశాఖ అధికారి దీనిపై చర్యలు తీసు కోకుంటే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు అందర్నీ ఏకం చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు, ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, కడప నగరం అధ్యక్షుడు కొండేటి హరిబాబు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 7న మాదిగల జనజాతర సభ

### ప్రెసిడెంట్ యన్ రాజా, గడ్డం నరసింహులు



ప్రొద్దుటూరు మేజర్ న్యూస్ ఎంఆర్పిఎస్ పురిటి గడ్డ ఈదు మూడిలో జులై 7తేదీన నిర్వ హించు మాదిగల జన జాతర సభను జయప్రదం చెయ్యాలని ఎంఆర్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ ఎన్ రాజా, ప్రొద్దు టూరు గడ్డం నరసింహులు పేర్కొన్నారు. బుధవారం ప్రొద్దుటూరు పట్టణంలోని ఎమ్మార్పీ ఎస్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయ కులు గడ్డం నరసింహులు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడు తూ ఆర్,యన్ రాజా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి జూలై 7 నాటికి 30 వసంతాల పూర్తి అవుతున్న సందర్భంగా మాదిగల జన జాతర సభను ప్రకాశం జిల్లా ఈదుమూడి కేంద్రంగా నిర్వహిస్తున్నాము అని తెలి పారు, ఇప్పుడు నూతనంగా అధికారంలోకి వచ్చిన బిజెపి,తెలుగుదేశం పార్టీ లు వర్గీకరణ కు ఎలక్షన్లకు ముందు అనాడు ఇచ్చిన మాట నిలబెట్టుకొని వర్గీకరణ అంశాన్ని త్వరగా సమస్యను పరిష్కారం చేయాలని కోరుతున్నాం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు జులై 7వ తేదీన ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో జరగబోయే జన జాతర సభకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా తరలి వెళ్లి ఆ యొక్క సభను జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ప్రొద్దు టూరు డివిజన్ అధ్యక్షులు దాసరి ఓబులేష్. డివిజన్ మండల నాయకులు బలసుబ్బయ్య. శ్రీనివాసులు, నారాయణ.చిన్న రంగ నాయ కులు, వెంకట రామంజినేయులు,పులయ్య, పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరం ఉండాలి

### సిఐ ఈశ్వరయ్య



యర్రగుంట్ల మేజర్ న్యూస్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు బుధవారం మత్తు పదార్థాల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఈ సీఐ ఈశ్వరయ్య, ఎస్ఇబిసిఐ లీలారాణి ముఖ్య అతిథు లుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నత శిఖరాల అధిరోహించడానికి దోహదపడుతుందని దాన్ని కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిలుగా మారి అడ్డుకట్ట వేసుకుంటున్నారని, మత్తు పదార్థాల ద్వారా జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జీతాలు నాశనం చేసుకుంటున్నారు అన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ మాస్టర్ మల్లికార్జున రాజు ఇతర అధ్యాపక అధ్యాపకేతుల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగునీటి శాఖ అధికారుల నిర్లక్ష్యం చెరువు కాలువలు మాయం



చిట్వేలి మేజర్ న్యూస్ అన్నమయ్య జిల్లా చిట్వేలి మండలం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న అంబేద్కర్ సర్కిల్ సౌకర్యాల కొరతతో అక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అంబేద్కర్ సర్కిల్ పైభాగం నుంచి వచ్చే వర్షపు నీరు అక్కడ ఉన్న కాలువ వెంబడి వెళుతూ ఉంటుంది కానీ ప్రస్తుతము ఆ కాలువను పూర్తిగా చెత్తాచెదారం వేయడం వల్ల కాలువ పూడిపోవడం జరిగింది అలాగే జరిగితే నీరు ప్రవహించకుండా అక్కడ పూర్తిగా నిల్వ ఉండే ప్రమాదం ఉంది కె ఎస్ అగ్రహారం పంచాయతీ పరిధిలోకి వస్తున్న ఈ పరిసరాలు సౌకర్యాల కల్పనలో ఆమడ దూరంలో ఉంది కనీసం పంచాయితీ చేయవలసిన పనులు వీధిలైట్లు కూడా ఆ ప్రాంతంలో వెలగకపోవడం అలాగే సాగునీటి వసతికి కూడా తీవ్రంగా ఇబ్బందిగా ఉందని అక్కడ ప్రజలు తెలియజేశారు ప్రభుత్వానికి చెల్లించ వలసిన అన్ని రకాల పనులు మేము కొడుతున్నామని మాకు ప్రభుత్వం ఎందుకు సౌకర్యాల కల్పనలో చొరవ చూపడం లేదని పంచాయతీ పైన తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు కాలువలు పూర్తిగా కనుమరుగవుతున్న విషయాన్ని సంబంధిత అధికారులు ను వివరణ అడగగా కాలువ లో అక్కడ ఉన్న ప్రజలు వేసే చెత్తాచెదారం వల్ల పూడిపోతూ ఉందని జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని వెంటనే అక్కడ స్థలాన్ని పరిశీలించి కాలువను తిరిగి యధా స్థానానికి తీసుకురావడం జరుగుతుందని ఆయన తెలియజేశారు ఇక్కడ జరుగుతున్న సంబంధిత విషయాలలో ఇరిగేషన్ మరియు పంచాయతీరాజ్ అధికారులలో సమన్వయం లేకపోవడం స్పష్టంగా కనబడుతుంది అన్ని రకాల సౌకర్యాలు తమకు కల్పించాలని పంచాయతీ అధికారులకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు

## విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ



చెన్నూరు మేజర్ న్యూస్ : మండలంలోని ముండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న టి.చిన్నపరెడ్డి,నిర్మలా దేవి ఉచితంగా అందిస్తున్న నోటు పుస్తకాలను మండల విద్యాశాఖధికారులు గంగిరెడ్డి, సునీత బుధవారం పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్య లో రాణించినప్పుడే భవిష్యత్ ఉజ్వలమవుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక భారాన్ని తగ్గించ డానికి ఉపాధ్యా యులు ఇలా విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

## జయచంద్ర రెడ్డిపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు

బి. కొత్తకోట, మేజర్ న్యూస్ : తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్ర రెడ్డి పై కొందరు అసత్య ఆరోపణలు, దుష్ప్రచారాలు ఫేస్ బుక్ పోస్టుల్లో పెట్టి రెచ్చగొడుతున్నారని వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని బి. కొత్తకోట పోలీస్ స్టేషన్లో బుధవారం టిడిపి నాయ కులు లిఖితపూర్వపు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు పార్టీలోకి వచ్చి అనతి కాలంలోనే తెలుగుదేశం పార్టీ ప్రతిష్టను పెంచినట్లు చెప్పారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో జయ చంద్రా రెడ్డి నాయకత్వంలోనే భవిష్యత్ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. గత ఎన్నికల్లో సైతం 47 వేలకు పైగా గెలిచిన ఎమ్మెల్యే మెజారిటీని పదివేలకు తగ్గించడమే కాక టిడిపిలోని కోవర్టులు చేసిన దుష్ప్రచారం, మోసంతో పాటు వైకాపా నాయకుల విచ్చలవిడిగా డబ్బు పంపిణీ, మద్యం పంపిణీ, రిగ్గింగు ద్వారా ఓటమిపాలయం తప్ప తంబల్లపల్లి నియోజకవర్గంలో నైతిక విజయం తెలుగుదేశం పార్టీ దేనన్నారు. జయచంద్రారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యుల మీద వ్యక్తిగతంగా, అవమానకరంగాను రెచ్చగొట్టే విధంగా ఫేస్ బుక్ లో సాగర్, వినూయాదవ్‌లు తో పాటు ఫేక్ అకౌంట్లను కనుగొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బి. కొత్తకోట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పలువురు టిడిపి నాయకులు తెలిపారు.

# కాంచరకాయలు వచ్చేశాయ్..

## కిలో 200 రూపాయలు
## చికెన్‌తో పోటీపడుతున్న కాంచన కాయలు



పులివెందుల, మేజర్‌న్యూస్ : సమయము సందర్భము రావడంతో కాంచర కాయలు మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం వీటి ధర కిలో 200 రూపాయలు చొప్పున క్రయవిక్రయాలు సాగుతున్నాయి. చికెన్ ధరలతో సరితూగుతున్న కంచరకాయల ధరలు ఎక్కువగా ఉండడంతో సామాన్యులకు రుచించలేదు. ప్రతి ఏటా జూన్ జూలై ఆగస్టు మాసాలలో కాంచరకాయల ఉత్పత్తి ఉంటుంది. సాగు చేపట్టకపోయినా ప్రకృతి సహజ సిద్ధంగానే పొలాల్లో చేలగట్లపై దర్శనం ఇస్తాయి. ఇవి వేరుశనగ సాగులోఎక్కువగా కాంచనరకాయలు ఉత్పత్తి అవుతాయి. కానీ గత కొంతకాలంగా పులివెందుల ప్రాంతంలో చాలావరకు కాంచర కాయలు ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయింది.ప్రస్తుతం వీటిని అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి కాంచరకాయలు దిగుమతి చేసుకొని వాటి విక్రయాలు ఇస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. నిత్యం ఉపయోగించే కాకరకాయల తరహాలో ఇవి కాస్త చిన్నవిగా ఉంటాయి. చిన్న కాకరకాయలు అని కూడా పిలుస్తారు. వీటిలో సి విటమిన్ పుష్కలంగా ఉండడంతో బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా తినడానికి ఇష్టపడతారు. వీటిని నిలువ చేసుకునే అవకాశం కూడా ఉంది. బాగా ఆరబెట్టిన తర్వాత కొన్నాళ్లకు వాటిని తీరిక దొరికిన సమయంలో వేంపుడుగా చేసుకుని ఎంచక్కా ఆరగిస్తారు. వగరు చేదు ఉన్న తినడానికి భలే రుచిగా ఉంటాయి. ఇప్పు డిప్పుడే ఇవి మార్కెట్లోకి రావడం వల్ల వీటి ధర ఎక్కువగానే ఉంది. కొద్ది రోజులు పోతే ధరలు తగ్గే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు సూచనప్రాయంగా అభిప్రాయం వెల్లడిస్తున్నారు. అయితే రవాణా చార్జీలు బాగా పెరిగిపోవడంతో తమకు కూడా ఖర్చులు బాగా వస్తాయని అందువల్ల తాము కూడా ధర పెంచితే తప్ప గిట్టుబాటు కావని వ్యాపారులు తేల్చి చెప్పారు.

# స్టాప్ డయేరియాబి-2024 క్యాంపైన్ కార్యక్రమం



పులివెందుల, మేజర్‌న్యూస్ : బిస్టాప్ డయేరియాబి-2024 క్యాంపైన్ లో భాగంగా మంచి నీటి ట్యాంకులు, సంపులు శుభ్రపరచి ఎటువంటి వ్యాధులు రాకుండా చూడాలని మునిసిపల్ వాటర్ వర్క్స్ సిబ్బందికి మునిసిపల్ కమీషనర్ జి. రమణా రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే రాజీవ్ కాలనీలో, సీయోనుపురం వద్ద వున్న రక్షిత మంచి నీటి ట్యాంకులు శుద్ధి చేయడము జరిగినదని, ఇతర ట్యాంకులు శుభ్రపరచమని ఈ సందర్భంగా తెలిపారు. సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు నీటి పరీక్ష నమోదు చేస్తూ, లీకేజీ వున్న పైప్ లైన్ లు తక్షణమే పునరుద్దరణ చేయమని ఆదేశిం చారు. పురప్రజలు ఇంట్లోని తాగునీటి తొట్టి శుభ్రపరచుకోవాలని, ఖాళీ స్థలాలలో ఎక్కడ చెత్తను వేయకుండా మునిసిపల్ వాహనానికే అందించే టట్లు చూడవలయునని సూచన చేశారు. 0-5 సంవత్సరాల పిల్లలకు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్, జింక్ టాబ్లెట్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది తమ సచివాలయ పరిధిలో ఐఈసి ఆక్టివిటీస్ ద్వారా ప్రజలను మోటివేట్ చేయవలసినదిగా తగు సూచనలు తెలిపారు. ఇందులో ఏకనాథ్ ఏ ఈ సానిటరీ ఇన్స్పెక్టర్ ట్. మురళీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జరికోన ప్రాజెక్టు కార్మికులకు వేతనాలు తక్షణమే చెల్లించాలి

## ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ



మదనపల్లె, మేజర్‌న్యూస్ : దాదాపు 10 సంవత్సరాలకు పైబడి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న జరికోన ప్రాజెక్టు కార్మికులకు పెండింగులో ఉన్న ఏడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని,వారిని ఆప్కాస్ లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.జరికోన ప్రాజెక్టులో ఆపరేటర్లు,రూట్ వర్క్ కార్మికులు దాదాపు 40 మంది దాకా కార్మికులు పనిచేస్తున్నారని, నెలనెలా కార్మికులకు వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఇచ్చే అరకొర వేతనాలు కూడా సక్రమంగా రాని కారణంగా కార్మికులు కుటుంబ పోషణ కూడా ఇబ్బందిగా మారిందన్నారు.అధికారులు తక్షణమే స్పందించి కార్మికులకు ఇవ్వాల్సిన ఏడు నెలల వేతనాలు చెల్లించాలని,ఈఫిఎఫ్,ఈయస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

# జూనియర్ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలలో శ్రీ విద్య విద్యార్థుల విజయభేరీ



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: స్థానిక పట్టణం లోని సూపర్ బజార్ రోడ్డు లోని శ్రీవిద్య జూనియర్ కాలేజి విద్యార్థులు బుధవారం విడుదలైన జూనియర్ ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలలో సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపల్ కె. ఓ. వి. రమణారావు తెలిపారు. జూనియర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను తేజశ్విని 467, గీతాంజలి 465, సనాసుహన -ట 465, ముస్కాన్ 465, లిఖిత, సాహితీ, ఉషశ్రీ 464, నస్రీన్ 463, రాజేశ్, నవ్య శ్రీ, యోషితా 462, నాగ గాయత్రి, హాసిని 460, జూనియర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను సఫియా 434, మూయిజ్ 433, రహమతున్నీసా బేగం, షబ్రిన్ 432, తహసీన్ 431, నౌస్మిన్ భాను 430 మార్కులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా బుధవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు శ్రీకాంత్ కుమార్ రెడ్డి, రామమోహన్ లు అభినందించారు.

# మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం



ప్రొద్దుటూరు, మేజర్ న్యూస్: స్థానిక తేజ హాస్పిటల్ నందు చికిత్స పొందు తున్న టీ.భయమ్మ అనే మహిళకి రక్తం తక్కువగా ఉండటంతో ఏ పాజిటివ్ రక్తం అత్య అవసరం కాగా వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఫౌండర్ మోరే.లక్ష్మణ్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యుడు భరత్ కుమార్ రెడ్డి చేత సురక్ష బ్లడ్ బ్యాంక్ నందు రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావు, ఫౌండేషన్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా, తదితరులు పాల్గొన్నారు.

# గంగమ్మ జాతరకు హాజరైన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్



కలికిరి, మేజర్‌న్యూస్: కలికిరి మండలంలోని మేడుకుర్తి గ్రామ పంచాయతీ పరమట కురవపల్లి నందు ఆరి గంగమ్మ అంకాలమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి హాజరైనట్లు రాజంపేట పార్లమెంట్ టిడిపి కుర్బా చైర్మన్ జనార్దన్ గౌడ్ తెలిపారు. బుధవారం ఆరి గంగమ్మ అంకాలమ్మ జాతర పురస్కరించుకొని మాజీ జిల్లా ఎంపీటీసీల ఉపాధ్యక్షుల స్వగృహం నందు ఆయన విందుకు పాల్గొని ఆరి గంగమ్మ అంకాలమ్మ యొక్క దేవతల ఆలయంలో పూజలు చేసి అనంతరం జనార్దన్ గౌడ్ స్వగృహం నందు విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సమస్యలు అధిగమించి గ్రామంలో అత్యధిక మెజార్టీ సాధించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, పీలేరు శ్రీకాంత్ రెడ్డి, కోటపల్లి బాబు రెడ్డి, బీసీ నాయకుడు మురళీధర్ గౌడ్, వాటర్షెడ్ రవి, మాజీ జెడ్పిటిసి మాలతి, టైలర్ జ్ఞాన, ఆరు మండలాల సీనియర్ నాయకులు మల్లారపు రవి ప్రకాష్ నాయుడు,మాజీ కలకడ ఎంపీపీ కాంతారావు, గుర్రంకొండ మండల అధ్యక్షుడు జగదీష్, వాల్మీకిపురం మాజీ ఎంపీపీ వల్లిగట్ల వెంకటరమణ, మల్లికార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి మార్ట్‌ని ప్రారంభించిన టిడిపి ఇన్‌చార్జ్ రూపానంద రెడ్డి



ఓబులవారిపల్లి, మేజర్‌న్యూస్: కోర్లకుంట క్రాస్ లోని ప్రకృతి సూపర్ మార్కెట్ ప్రారంభానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ముక్కా రూపానంద రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం రైల్వే కోడూరు టీడీపీ ఇంచార్జ్ శ్రీ ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ తక్కువ ధరలకే వస్తువులను ప్రజలకి అందించాలనే సంకల్పంతో రూపొందించిన ప్రకృతి మార్టను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు నాణ్యమైన వాటిని ప్రకృతి మార్ట్ ద్వారా ప్రజలకు అందించాలని ప్రకృతి యాజమాన్యం వారికి సూచించారు ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డిస్టిక్ లెవెల్ మానిటరింగ్ కమిటీ మీటింగ్

కడప, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాను సారంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్ న్యాయ సేవా సదన్ కడప నందు " హిట్ అండ్ రన్ కేసులు, ఫస్ట్ యాక్సిడెంట్ రిపోర్ట్, జిల్లా స్థాయి కమిటీ పనితీరు, పరిహారం ప్రక్రియ, బాధితులకు పరిహారం జారీ మొదలగు అంశాలపై " డిస్టిక్ లెవెల్ మానిటరింగ్ కమిటీ మీటింగ్ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిటిసి కడప డిఎస్పి రవికుమార్, సిసిఎస్ రాయచోటి అన్నమయ్య జిల్లా డిఎస్పి, పి శ్రీధర్, ఆర్డిఓ మదనపల్లి, హరి ప్రసాద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కడప జె రవీంద్ర, కడప ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వి.సీతారామిరెడ్డి పాల్గొన్నారు.